SRIVEDHA WEB SOLUTIONS
Empowering Business Digitally!
Our Services
✓ Website Design & Development
✓ Digital Marketing (SEO/SEM,SMM, Google Ads)
✓ Branding Graphic Design
✓ CGI Ads | Meta Ads | AI Videos
Want to take your business online?
Now it's simple! At SRIVEDHA WEB SOLUTIONS, we build businesses a strong online presence through smart website design, powerful digital and brand identity. We deliver quality, and results – everything a brand needs to grow digitally.
Office Address: VSS Nandaeep Apartment, Call: 95731 23699 Email: srivedhawebsolutions@gmail.com www.srivedhawebsolutions.com

సమాజ హితం – మా అభిమతం
www.arunaprabha.com
# అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
RNI NO. TEL TEL/2023/89778

unitedtradinglogistics@gmail.com
+91 7995813899
+91 9059862988
UNITED LOGISTICS
AIR CARGO SERVICES | SHIPMENT SERVICES
20",40" CONTAINER SERVICES | FLATRACK CONTAINER SERVICES
Near ORR Exit No.11, Opp. TARA Convention Hall, Pedda Amberpet, Hyderabad, Telangana.

రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 192 పేజీలు : 12, వెల రూ. 5/- గురువారం, సెప్టెంబరు 3, 2026
PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL




# సురేఖపై అధిష్ఠానం కొరడా?

మంత్రి కొండా సురేఖ వ్యవహారం ఐ కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద కీలక దశకు చేరినట్లు తెలుస్తోంది. ఆమెను మంత్రివర్గం నుంచి తప్పించేందుకు అధిష్ఠానం సానుకూలంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో మంగళ, బుధవారాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా రాష్ట్రానికి చెందిన పలువురు కీలక నేతలు పార్టీ అగ్రనేతలతో వరుసగా జరిపిన చర్చల అనంతరం ఈ దిశగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నుంచి అధికారిక సమాచారం వచ్చిన తర్వాతే తదుపరి చర్యలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## మంత్రివర్గం నుంచి తప్పించేందుకు రంగం సిద్ధం

- చర్యకు సీఎం రేవంత్‌రెడ్డి పట్టుబట్టినట్లు సమాచారం
- పీసీసీ, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి కూడా అదే వైపు
- క్రమశిక్షణ కమిటీ సిఫార్సుతో అధిష్ఠానం సానుకూలత
- ఖర్గేను కలిసినా ఫలితం దక్కలేదని పార్టీ వర్గాల్లో చర్చ
- చిన్నారెడ్డిపై కూడా వేటుకు అంగీకారం?
- గురువారమే కీలక నిర్ణయం వెలువడే అవకాశం

దిల్లీ: కొండా సురేఖ వ్యవహారంపై గత కొంతకాలంగా రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర చర్చ జరుగుతోంది. వివాదం ముదరడంతో విషయం అధిష్ఠానం దృష్టికి వెళ్లింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంలో చర్య తీసుకోవాలని గట్టిగా పట్టుబట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా చర్యకు అనుకూలంగా

(మిగతా 2వ పేజీలో)

# ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు రండి!

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- డిసెంబరు 7 నుంచి మూడు రోజులపాటు గ్లోబల్ సమ్మిట్
- రక్షణ ఎక్స్‌పో--2026 ప్రారంభించాలని విజ్ఞప్తి
- ఎయిర్‌షో, లైవ్ డెమోల ఏర్పాట్లపై ప్రత్యేకంగా చర్చ
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి మరో 750 ఎకరాలు సేకరిస్తాం
- డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు 416 ఎకరాల భూమి కేటాయింపు



న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7 నుంచి మూడు రోజులపాటు జరగనున్న ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం భేటీ అయి సమ్మిట్ లక్ష్యాలు, తెలంగాణలో రక్షణ రంగ పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్ష రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. రక్షణ ఎక్స్‌పోలో భాగంగా ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్ష రంగాలపై ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. దీనితోపాటు ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూఉపరితల రక్షణ వ్యవస్థలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ ఎక్స్‌పోకు ముఖ్యఅతిథిగా హాజరై పారిశ్రామికవేత్తలు, రక్షణ రంగ సంస్థలకు మార్గనిర్దేశం చేయాలని రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు మంజూరు చేయాలని,

(మిగతా 2వ పేజీలో)



## ఆదాయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సత్తా..

- దేశంలో అత్యధిక ఆదాయం గల రైల్వే స్టేషన్లలో సికింద్రాబాద్‌కు 4వ స్థానం
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,276 కోట్ల ప్రయాణికుల ఆదాయం నమోదు
- న్యూఢిల్లీ, హౌరా, చెన్నై తర్వాత నాలుగో స్థానంలో నిలిచిన సికింద్రాబాద్

## 1500 కండక్టర్ పోస్టుల భర్తీ: మంత్రి పొన్నం



- 1000 రోజుల పాలనలో టీజీఎస్‌ఆర్టీసీ సాధించిన ప్రగతిని వివరించిన ప్రభుత్వం
- మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.12,167 కోట్ల ఆర్థిక ప్రయోజనం
- ఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు.. 4,538 పోస్టుల భర్తీకి చర్యలు
- ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేసిన మంత్రి పొన్నం

## నేపాల్ వరదల్లో కైలాస యాత్రికులు గల్లంతు.. ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న తెలుగు కుటుంబాలు

- వరదల్లో పలువురు కైలాస యాత్రికులు గల్లంతు
- లభ్యం కాని హైదరాబాద్ ఎన్నారై కుటుంబం
- మరో యాత్రికుడు ధన్‌పాల్ రెడ్డి కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపు
- గల్లంతైన వారిలో ఏపీకి చెందిన ఎన్నారై కూడా ఉన్నట్లు సమాచారం
- సమాచారం అందక ఆందోళనలో పలు తెలుగు కుటుంబాలు



# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజారంజకం

- ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదు: పొంగులేటి
- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సామాన్యుల కష్టాలు తీర్చేందుకు కృషి చేశామన్న పొంగులేటి
- రైతు సంక్షేమానికి రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడి



తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ

(మిగతా 2వ పేజీలో)



## కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

- రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారన్న రాజ్‌గోపాల్ రెడ్డి
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగదని వ్యాఖ్య
- వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి

# ఎటు చూసినా విధ్వంసం, వికృతమే

- కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల
- కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్
- కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో

(మిగతా 2వ పేజీలో)

# ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు రండి!

యుద్ధ విమానాలతోపాటు సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాల ప్రదర్శనలు ఉండేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రత్యక్షంగా ప్రదర్శించేలా త్రివిధ దళాలకు చెందిన పరికరాల ప్రదర్శనకు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. రాజ్‌నాథ్‌సింగ్‌తో జరిగిన సమావేశంలో ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ అంశం కూడా చర్చకు వచ్చింది. విమానాశ్రయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూమిని సేకరించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రక్షణ శాఖ మొత్తం 1,500 ఎకరాల భూమిని కోరిన నేపథ్యంలో మిగిలిన మరో 750 ఎకరాలను కూడా సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. విమానాశ్రయ అభివృద్ధికి కేంద్రంతో సమన్వయంతో ముందుకు వెళ్తామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థకు సంబంధించిన ప్రాజెక్టు ఏర్పాటుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించనున్నట్లు సీఎం వెల్లడించారు. నామమాత్రపు రుసుముతో 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్‌సింగ్‌కు వివరించారు. రక్షణ రంగానికి సంబంధించిన పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు తెలంగాణలో అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధిపై కూడా సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో బుధవారం జరిగిన భేటీలో ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని కోరారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్తి చేసి కేంద్రానికి అప్పగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇక ఆలస్యం లేకుండా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మామునూరు విమానాశ్రయానికి సంబంధించి టెండర్లను రెండు వారాల్లో ఆహ్వానిస్తామని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. డిసెంబరు నాటికి టెండర్ల ప్రక్రియను ఖరారు చేసి వచ్చే ఏడ నెలలో పనులకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. దీంతో వరంగల్ ప్రాంతానికి విమానయాన సదుపాయాలు అందుబాటులోకి వచ్చే ప్రక్రియ వేగం పుంజుకునే అవకాశం ఉంది. ఆదిలాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు, సరుకు రవాణాకు అవసరమైన మౌలిక సదుపాయాలతోపాటు మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్ వసతులు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. రన్‌వేకు సంబంధించి తుది నిర్ణయం తీసుకునేందుకు రక్షణ, పౌర



విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విమానాశ్రయ అభివృద్ధి ద్వారా ఉత్తర తెలంగాణలో వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని వివరించారు. తెలంగాణలో హెలి టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రం సహకరించాలని కూడా రేవంత్‌రెడ్డి కోరారు. పర్యాటక ప్రాంతాలను అనుసంధానించేలా హెలికాప్టర్ సేవలను విస్తరించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో సీప్లేన్ ల్యాండింగ్ అవకాశాలపైనా చర్చ జరిగింది. దీనికి సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు సీఎంకు తెలిపారు. రాజ్‌నాథ్‌సింగ్‌తో జరిగిన సమావేశంలో మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్) హర్కర వేణుగోపాల్ పాల్గొన్నారు. రక్షణ రంగంలో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అవకాశాలను వివరించడంతోపాటు రాబోయే గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు కీలక గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని సీఎం వివరించారు.

# సురేఖపై అధిష్ఠానం కొరడా?

ఉన్నట్లు సమాచారం. దీనికి తోడు పీసీసీ క్రమశిక్షణ కమిటీ సైతం చర్య తీసుకోవాలని సిఫార్సు చేసిన నేపథ్యంలో అధిష్ఠానం కూడా సానుకూల నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఢిల్లీలోనే ఉన్న కొండా సురేఖ బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. తనపై జరుగుతున్న పరిణామాలను ఆయనకు వివరించినట్లు సమాచారం. పార్టీలో తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని ఆమె పేర్కొంటూ ఒక నివేదికను కూడా సమర్పించినట్లు తెలిసింది. అయితే ఖర్గేతో భేటీ అనంతరం పరిణామాల్లో మార్పు కనిపించకపోవడంతో ఆమెకు ఊరట లభించలేదన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది. పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసేందుకు ఆమె ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులో లేకపోయినట్లు సమాచారం. సురేఖ వ్యవహారం నేపథ్యంలో ఢిల్లీలో బుధవారం రోజంతా తెలంగాణ కాంగ్రెస్ నేతల భేటీలు కొనసాగాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలుత ఇందిరాభవన్‌లో కేసీ వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యవహారాలు, సురేఖ వివాదం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా వేణుగోపాల్, ఖర్గేతో వేర్వేరుగా సమావేశమై పరిస్థితిని వివరించారు. మరోవైపు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో సమావేశమయ్యారు. అనంతరం కొండా సురేఖ కూడా మీనాక్షిని కలిసి తన వాదనను వినిపించారు. తనకు వ్యతిరేకంగా పార్టీలో కొందరు కుట్ర చేస్తున్నారని ఆమె వివరించినట్లు సమాచారం. తనపై వచ్చిన ఆరోపణలు, వివాదానికి దారితీసిన అంశాలపై వివరణ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా ఖర్గేతో సమావేశమై రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ వరుస భేటీలతో సురేఖ వ్యవహారంపై అధిష్ఠానం ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రెండు వారాలుగా రాష్ట్ర కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా ఉన్న ఈ వ్యవహారంపై అధిష్ఠానం తాజాగా స్పందించినట్లు నాయకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సురేఖతోపాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని ఆ పదవి నుంచి తప్పించేందుకు కూడా అధిష్ఠానం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఇద్దరి వ్యవహారాలు కొంతకాలంగా పార్టీ, ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా ఉన్నాయి. చిన్నారెడ్డి విషయంలోనూ అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొండా సురేఖ మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. అప్పటి నుంచి ఆమె వ్యవహారశైలి, వివిధ సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు పలు మార్లు రాజకీయంగా చర్చకు దారితీశాయి. తాజాగా మరోసారి వివాదం తలెత్తడంతో పార్టీ అధిష్ఠానం వరకు విషయం వెళ్లింది. ఈసారి ముఖ్యమంత్రి స్థాయిలోనే చర్యకు పట్టుబట్టడంతో పరిణామాలు వేగంగా మారినట్లు తెలుస్తోంది. బుధవారం సాయంత్రం రేవంత్‌రెడ్డి మరోసారి ఖర్గేతో సన్నిహితంగా భేటీ అయ్యారు. ఖర్గే నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి ఆయన కారులోనే వైఎస్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి వెళ్లారు. కార్యక్రమంలో ఇద్దరూ పక్కపక్కనే కూర్చుని వివిధ అంశాలపై చర్చించుకున్నారు. ఈ భేటీ అనంతరం సురేఖపై చర్యకు అధిష్ఠానం తుది ఆమోదం తెలిపిందన్న ప్రచారం మరింత ఊపందుకుంది.

అయితే అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ వ్యవహారంపై స్పష్టత రానుంది. కాంగ్రెస్ అధ్యక్షుడి నుంచి రాష్ట్ర నాయకత్వానికి అధికారిక సమాచారం అందిన తర్వాతే మంత్రివర్గం నుంచి తొలగించే ప్రక్రియ ప్రారంభమవుతుందని పార్టీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు పేర్కొన్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే గురువారమే దీనిపై తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో సురేఖ విషయంలో అధిష్ఠానం తుది నిర్ణయం ఏమిటన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## టీజీఎస్ఆర్టీసీలో
## 1500 కండక్టర్ పోస్టుల భర్తీ: మంత్రి పొన్నం

తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రవాణా శాఖ, టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని ప్రభుత్వం వెల్లడించింది. ప్రజా రవాణాను బలోపేతం చేయడంతో పాటు మహిళలు, ప్రయాణికులు, కార్మికులకు మేలు చేసేలా అనేక సంస్కరణలు చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి గుర్తుచేశారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 347.36 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, తద్వారా వారు రూ.12,167 కోట్ల ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమయ్యాక ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేటు 67శాతం నుంచి 89శాతానికి పెరిగిందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 600 బస్సులకు మహిళలనే యజమానులుగా చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీజీఎస్ఆర్టీసీలో భారీగా కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేయగా, అందులో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు అమలు చేశామని, ప్రస్తుతం ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదని స్పష్టం చేశారు. 1,424 కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు, గతంలో సర్వీసు నుంచి తొలగించిన 244 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని తెలిపారు. 4,538 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా, 1,000 డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామక ప్రక్రియ పూర్తయిందని, త్వరలో మరో 1500 కండక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు.

## కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు: రాజ్‌గోపాల్‌రెడ్డి



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాధించిన ప్రగతి ఇదే: కవిత

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వెయ్యి రోజుల కాలం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేర్చని హామీలతోనే సాగిందని ఆమె ధ్వజమెత్తారు. గడిచిన వెయ్యి రోజుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల బతుకులను బాగు చేసింది ఏమీ లేదని, కేవలం కొందరి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని మండిపడ్డారు. హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం, సంక్షేమ గురుకులాల్లో భద్రత లేక విద్యార్థులు వరుసగా మరణించడం, జాబ్ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం, పంటలకు మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు పెరిగిపోవడం.. వీటికి తోడు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి నేరాలు నిత్యకృత్యం కావడమే ఈ ప్రభుత్వం సాధించిన అసలైన 'ప్రగతి' అని ఎద్దేవా చేశారు. ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఈ సర్కార్ కాలం చెల్లిపోయిందని హెచ్చరించారు. ప్రభుత్వ అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని, ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

## ఆదాయంలో సికింద్రాబాద్
## రైల్వే స్టేషన్ సత్తా.. దేశంలో నాలుగో స్థానం!
### దేశంలో అత్యధిక ఆదాయం గల
### రైల్వే స్టేషన్లలో సికింద్రాబాద్‌కు 4వ స్థానం
### గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,276 కోట్ల ప్రయాణికుల ఆదాయం నమోదు

హైదరాబాద్: దేశంలో అత్యధిక వార్షికాదాయం ఆర్జించే రైల్వే స్టేషన్ల జాబితాలో సికింద్రాబాద్ జంక్షన్ సత్తా చాటింది. ప్రయాణికుల రాకపోకలు, ఆదాయం రెండింటిలోనూ దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందింది. గత ఆర్థిక సంవత్సరంలో సికింద్రాబాద్ స్టేషన్ ప్రయాణికుల ద్వారా రూ.1,276.29 కోట్ల ఆదాయం ఆర్జించగా, సుమారు 2.78 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ వివరాలను రైల్వే శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. రైల్వే నివేదిక ప్రకారం, ఈ జాబితాలో న్యూఢిల్లీ స్టేషన్ రూ.3,337 కోట్లతో మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్‌లోని హౌరా (రూ.1,692 కోట్లు), తమిళనాడులోని ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (రూ.1,299 కోట్లు) స్టేషన్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. వీటి తర్వాత సికింద్రాబాద్ నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాల మధ్య కీలకమైన అనుసంధాన కేంద్రంగా ఉండటమే సికింద్రాబాద్ స్టేషన్ ఈ ఘనత సాధించడానికి ప్రధాన కారణమని రైల్వే శాఖ పేర్కొంది. దక్షిణ మధ్య రైల్వేకు జోనల్ ప్రధాన కార్యాలయంగా ఉన్న సికింద్రాబాద్ నుంచి రోజుకు సుమారు 180కి పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతిరోజూ దాదాపు 1.5 లక్షల నుంచి 2 లక్షల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ ద్వారా ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం అమృత్ భారత్ పథకం కింద సుమారు రూ.714 కోట్లతో స్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. విమానాశ్రయాలకు దీటుగా ప్రపంచ స్థాయి సౌకర్యాలు, మెట్రోతో అనుసంధానం, మల్టీ-లెవల్ పార్కింగ్ వంటివి ఈ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.

## ఎటు చూసినా విధ్వంసం, వికృతమే

ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

## నేపాల్ వరదల్లో కైలాస యాత్రికులు గల్లంతు..
## ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న తెలుగు కుటుంబాలు

హైదరాబాద్: కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన పలువురు తెలుగు యాత్రికులు నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతయ్యారు. వీరిలో ప్రవాస భారతీయులు కూడా ఉండటంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు 26న ఈ విపత్తు సంభవించినప్పటి నుంచి వారి గురించి ఎలాంటి సమాచారం లభించకపోవడంతో బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, సమాచారం చేరడంలో జాప్యం జరుగుతుండటంతో బాధితుల కుటుంబాలు ఆశతో ఎదురుచూస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై శ్రీధర్ అవ్వారి, ఆయన భార్య దీప్తి, 14 ఏళ్ల కుమారుడు అభినవ్ ఆగస్టు 13న ఈశా ఫౌండేషన్ బృందంతో కలిసి యాత్రకు వెళ్లారు. ఆగస్టు 26 నుంచి వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఈశా ఫౌండేషన్‌ను సంప్రదించారు. యాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో, నేపాల్-చైనా సరిహద్దులోని ఇమ్మిగ్రేషన్ కేంద్రం వద్ద వారు వరదల్లో చిక్కుకున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారని దీప్తి సోదరుడి భార్య ప్రియాంక రాపాక వివరించారు. మణికొండకు చెందిన 38 ఏళ్ల ధన్‌పాల్ రెడ్డి ఆచూకీ కూడా ఇంకా లభ్యం కాలేదు. పుణే నుంచి వెళ్లిన 66 మంది యాత్రికుల బృందంలో తెలంగాణకు చెందిన వ్యక్తి ఈయన ఒక్కరే. వరదలు సంభవించిన రోజున నేపాల్ ఇమ్మిగ్రేషన్ సెంటర్ నుంచి ఆయన చివరిసారిగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన ఆచూకీ కోసం బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. చేతులు, భుజాలపై ఉన్న శివుడి టాటూల ద్వారా తన భర్తను గుర్తించవచ్చని ఆయన భార్య సుప్రియ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ బాధితుని కుటుంబ సభ్యులతో మాట్లాడి, తగిన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన, ప్రస్తుతం ఖతార్‌లో నివసిస్తున్న ఎన్నారై చొప్పరపు రమేశ్‌బాబు సైతం ఇదే యాత్రకు వెళ్లి గల్లంతయ్యారు. మరోవైపు, ఇదే మార్గంలో యాత్రకు వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన రాజేశ్వరి అనే మహిళ, ఈ విపత్తు సంభవించడానికి నాలుగు రోజుల ముందే సురక్షితంగా తిరిగి రావడం గమనార్హం.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజారంజకం

అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు. కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

## అయోధ్య రామ మందిరానికి కొత్త సీఈఓ..
## 5 వేల మందిలో మాజీ ఎయిర్ మార్షల్ ఎంపిక!

రామ మందిరానికి తొలి సీఈఓగా జీతేంద్ర మిశ్రా ఎంపిక

గతంలో ఎయిర్‌ఫోర్స్ వెస్టన్ కమాండ్ చీఫ్‌గా బాధ్యతలు

సీఈఓ అధికారాల కోసం ట్రస్ట్ డీడ్‌లో మార్పులు

మందిర భద్రతకు శాశ్వత కమిటీ ఏర్పాటు ప్రతిపాదన

విరాళాల అక్రమాలపై సిట్ విచారణను సమీక్షించనున్న ట్రస్ట్



అయోధ్య రామ మందిరం పరిపాలనకు తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జీతేంద్ర మిశ్రాను నియమించే అవకాశం ఉంది. 5 వేల మందికి పైగా దరఖాస్తుదారుల నుంచి ఆయన్ను ఎంపిక చేసినట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. భారత వైమానిక దళంలో పలు కీలక కమాండ్ బాధ్యతలు నిర్వహించిన జీతేంద్ర మిశ్రా.. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో వెస్టన్ కమాండ్ చీఫ్‌గా పనిచేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ భేటీలో 12 అంశాలపై చర్చించనున్నారు. ఇందులో రామ మందిరానికి తొలి సీఈఓ నియామకం ప్రధాన అంశంగా ఉంది. సీఈఓకు విస్తృత పరిపాలనా అధికారాలు కల్పించేలా ట్రస్ట్ డీడ్‌లో మార్పులు చేయాలని కూడా నిర్ణయించే అవకాశం ఉంది. 2020 ఫిబ్రవరి 5న ట్రస్ట్ ఏర్పాటైన తర్వాత డీడ్‌లో మార్పులు చేయడం ఇదే తొలిసారి కానుంది. మందిరంలో విరాళాల అక్రమాల ఆరోపణలు, సమర్పణల నగదు మాయం వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ట్రస్ట్ నిర్వహిస్తున్న మూడో సమావేశం ఇది. ఈ వ్యవహారం నేపథ్యంలో ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. మందిరం పరిపాలనను మరింత ప్రొఫెషనల్‌గా, పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి సీఈఓ అవసరమని రామ మందిర నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా గతంలో పేర్కొన్నారు. సీఈఓ ప్రభుత్వ జోక్యం లేకుండా పనిచేస్తారని, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శికి నివేదిస్తారని సమాచారం. సీఈఓకు చట్టపరమైన, పరిపాలనా, ఆర్థిక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. ట్రస్ట్ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, చట్టపరమైన నిబంధనలను పాటించేలా చూడటం వంటి బాధ్యతలు కూడా ఆయన పరిధిలోకి రానున్నాయి.

# మంత్రివర్గ విస్తరణ.. రేవంత్ ముందున్న అసలైన పరీక్ష!

### పదవుల పందేరం కాదు.. పాలనకు కొత్త రూపమివ్వాల్సిన తరుణం

**తెలంగాణ రాజకీయాల్లో మంత్రివర్గ విస్తరణ అంశం మరోసారి కేంద్ర బిందువుగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్న తరుణంలో మంత్రివర్గంలో మార్పులు, చేర్పులపై ఊహాగానాలు ఊపందుకోవడం సహజంగానే రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. అసెంబ్లీ సమావేశాలు సమీపిస్తున్నాయి. ప్రభుత్వం తన పాలనా ప్రస్థానంలో కీలక దశలోకి అడుగుపెడుతోంది. ప్రతిపక్షాలు ప్రభుత్వ పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నాయి. అధికార పార్టీలోనూ పదవుల కోసం ఆశలు, అసంతృప్తులు, ప్రాంతీయ ప్రాతినిధ్యంపై డిమాండ్లు కొనసాగుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా తెలంగాణలో పార్టీ, ప్రభుత్వ పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ జరిగితే అది కేవలం ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేసే సాధారణ పరిపాలనా ప్రక్రియగా మిగిలిపోతుందా? లేక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తన పాలనకు కొత్త రూపు ఇచ్చే కీలక నిర్ణయంగా మలుచుకుంటుందా? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.**

మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలన్న ఆశతో పలువురు ఎమ్మెల్యేలు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో గెలిచిన ప్రతి ఎమ్మెల్యేకూ మంత్రి పదవి రావడం సాధ్యం కాదు. అయినప్పటికీ రాజకీయంగా తనకు బలం ఉందని భావించే ప్రతి నాయకుడూ అవకాశం కోసం ప్రయత్నించడం సహజం. కాంగ్రెస్ వంటి పెద్ద పార్టీలో ఈ పోటీ మరింత సహజం. ఒకవైపు సీనియర్ నాయకులు తమ అనుభవాన్ని ప్రాతిపదికగా చూపిస్తుంటే.. మరోవైపు కొత్తగా ఎదిగిన నాయకులు తమకు అవకాశం కల్పించాల్సిందేనని కోరుతున్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నేతలు తమ రాజకీయ భవిష్యత్తుపై హామీ కోరుతున్నారు. సామాజిక వర్గాల ప్రాతినిధ్యం కోసం ఆయా వర్గాల నుంచి ఒత్తిడి వస్తోంది. ప్రాంతాల వారీగా సమతుల్యత ఉండాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది.

ఈ సమీకరణాలన్నింటి మధ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నదే ఇప్పుడు ఆసక్తికరం.

#### ఖాళీల భర్తీతోనే సరిపెడతారా?

**మంత్రివర్గ విస్తరణ చర్చలో మొదటి ప్రశ్న ఇదే. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేస్తారా? లేక మొత్తం మంత్రివర్గ పనితీరును సమీక్షించి కొన్ని మార్పులు చేస్తారా? రాజకీయ వర్గాల్లో రెండో అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోంది. ఎందుకంటే ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో మంత్రివర్గ కూర్పు ఒక అవసరం. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. రెండున్నరేళ్ల పాలన తర్వాత ప్రతి మంత్రి పనితీరుపై ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంది. ఎవరి శాఖలో పురోగతి కనిపిస్తోంది? ఎవరి శాఖపై ప్రజల్లో సంతృప్తి ఉంది? ఎక్కడ నిర్ణయాలు వేగంగా జరుగుతున్నాయి? ఎక్కడ విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి? పార్టీతో, అధికార యంత్రాంగంతో సమన్వయం ఎలా ఉంది? వంటి అంశాలు సహజంగానే సమీక్షకు వస్తాయి. అందువల్ల ఖాళీల భర్తీతోపాటు శాఖల మార్పులు, కొందరికి అదనపు బాధ్యతలు, అవసరమైతే కొందరిని తప్పించి కొత్తవారికి అవకాశం ఇవ్వడం వంటి అంశాలు చర్చకు రావడం అసాధారణం కాదు. అయితే ఊహాగానాలు ఎన్ని ఉన్నా తుది నిర్ణయం ముఖ్యమంత్రి, పార్టీ అధిష్ఠానం మధ్య జరిగే చర్చలపైనే ఆధారపడి ఉంటుంది. ఇక్కడే మంత్రివర్గ విస్తరణ రాజకీయ ప్రాధాన్యం పెరుగుతోంది. ఒక ఎమ్మెల్యేను మంత్రిగా ఎంపిక చేయడం ద్వారా ఆయనకు పదవి మాత్రమే ఇవ్వడం కాదు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతానికి, సామాజిక వర్గానికి, రాజకీయ వర్గానికి కూడా ఒక సంకేతం పంపినట్టే. అందుకే ప్రతి ఎంపిక వెనుక రాజకీయ లెక్క ఉంటుంది.**

#### ఢిల్లీ చర్చలు.. తుది నిర్ణయం ఎటు?

తెలంగాణ కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బలమైన నాయకుడిగా ఎదిగినప్పటికీ, పార్టీకి సంబంధించిన కీలక నిర్ణయాల్లో అధిష్ఠానం పాత్రను విస్మరించలేం. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలు, పార్టీ అగ్రనేతలతో సమావేశాలు జరుగుతున్న ప్రతిసారీ రాష్ట్ర రాజకీయాల్లో సహజంగానే ఆసక్తి పెరుగుతోంది. ఇప్పుడు కూడా అదే పరిస్థితి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ఢిల్లీ పర్యటనకు వెళ్లడం, పార్టీ పెద్దలను కలవడం, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించడం వంటి పరిణామాలు మంత్రివర్గ విస్తరణ ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నాయి. మంత్రివర్గ కూర్పుతోపాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పనితీరు వంటి అంశాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా తెలంగాణ కీలక రాష్ట్రం. దక్షిణాదిలో పార్టీకి అధికారంలో ఉన్న ముఖ్యమైన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఇక్కడ ప్రభుత్వం బలంగా ఉంటే జాతీయ స్థాయిలో పార్టీకి రాజకీయంగా ఉపయోగపడుతుంది. అదే సమయంలో ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగితే దాని ప్రభావం పార్టీపై పడుతుంది. అందుకే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణను కేవలం రాష్ట్ర నాయకత్వ నిర్ణయంగా కాకుండా పార్టీ భవిష్యత్ వ్యూహంలో భాగంగా కూడా చూడవచ్చు.

#### 'ఎవరు వస్తారు?' కంటే 'ఎవరు వెళ్తారు?' అన్న ఉత్కంఠ

మంత్రివర్గ విస్తరణలో సాధారణంగా కొత్తగా ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చే ఎక్కువగా ఉంటుంది. కానీ ఈసారి 'ఎవరిని తప్పిస్తారు?' అన్న ప్రశ్న కూడా అంతే ఆసక్తిని రేపుతోంది. కొందరు మంత్రుల పనితీరుపై సమీక్ష జరుగుతుందన్న ప్రచారం దీనికి కారణం. అయితే ఒక మంత్రిని తప్పించడం అంత సులభమైన విషయం కాదు. మంత్రిగా పనిచేస్తున్న వ్యక్తికి నియోజకవర్గంలో ఉన్న రాజకీయ బలం, సామాజిక వర్గంలో ఉన్న ప్రభావం, పార్టీతో ఉన్న సంబంధాలు, భవిష్యత్ ఎన్నికల్లో ఆయన పాత్ర వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఒక మంత్రిని తప్పిస్తే ఆయన స్థానంలో ఎవరిని తీసుకోవాలి? ఆ మార్పు వల్ల ఏర్పడే రాజకీయ ఖాళీని ఎలా పూరించాలి? అన్నది కూడా ఆలోచించాల్సి ఉంటుంది. అందుకే పనితీరు సమీక్ష తప్పనిసరి అయినప్పటికీ.. దాని ఆధారంగా తీసుకునే నిర్ణయాలు రాజకీయంగా సున్నితమైనవే.

అయితే ఒక విషయం మాత్రం స్పష్టం. మంత్రిపదవి రాజకీయ రక్షణ కవచంగా మారకూడదు. ఒక శాఖను సమర్థంగా నడపలేకపోతే కేవలం రాజకీయ సమీకరణాల కారణంగా అదే వ్యక్తిని కొనసాగించడం వల్ల ప్రభుత్వానికే నష్టం. ప్రజలు ఇప్పుడు మంత్రులను గతంలో కంటే ఎక్కువగా గమనిస్తున్నారు. ప్రతి నిర్ణయం, ప్రతి ప్రకటన, ప్రతి హామీ సామాజిక మాధ్యమాల్లో చర్చకు వస్తోంది. అందువల్ల మంత్రుల పనితీరును ఎప్పటికప్పుడు అంచనా వేయాల్సిన అవసరం ఉంది.



#### ప్రాంతాల మధ్య సమతుల్యతే మరో సవాలు

తెలంగాణలో ప్రాంతీయ రాజకీయాలకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. ఉమ్మడి జిల్లాల వారీగా నాయకత్వ బలం, సామాజిక సమీకరణాలు, ఎన్నికల ఫలితాలు, పార్టీ స్థితిగతులు మారుతూ ఉంటాయి. హైదరాబాద్ నగరం నుంచి ఉత్తర తెలంగాణ వరకు, ఉమ్మడి ఖమ్మం నుంచి నల్గొండ వరకు, ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి వరంగల్ వరకు ప్రతి ప్రాంతానికీ ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యం ఉంది. మంత్రివర్గంలో తమ ప్రాంతానికి తగిన ప్రాతినిధ్యం లేదని భావించే పరిస్థితి ఏర్పడితే స్థానికంగా అసంతృప్తి పెరగవచ్చు. అదే సమయంలో ఒక ప్రాంతం నుంచి ఎక్కువ మందిని మంత్రులుగా తీసుకుంటే ఇతర ప్రాంతాల నుంచి ప్రశ్నలు రావచ్చు. ఇది కేవలం రాజకీయ నాయకుల సమస్య కాదు. ఒక ప్రాంతానికి చెందిన మంత్రి తన ప్రాంత సమస్యలను ప్రభుత్వ దృష్టికి మరింత బలంగా తీసుకెళ్లగలడన్న భావన ప్రజల్లో ఉంటుంది. అందుకే ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని పూర్తిగా విస్మరించడం సాధ్యం కాదు. అయితే ప్రతి ప్రాంతానికి ఒక మంత్రి ఇవ్వడం కూడా సాధ్యం కాదు. కాబట్టి రాజకీయ సమతుల్యత, పరిపాలనా సామర్థ్యం మధ్య సమన్వయం సాధించాల్సిందే.

#### సామాజిక న్యాయానికి ఎంత ప్రాధాన్యం?

మంత్రివర్గ విస్తరణలో అత్యంత సున్నితమైన అంశం సామాజిక సమీకరణాలు. తెలంగాణ రాజకీయాల్లో బీసీ వర్గాల ప్రాతినిధ్యం గురించి చర్చ పెరుగుతున్న సమయంలో కొత్త మంత్రివర్గ కూర్పుపై కూడా ఆ ప్రభావం ఉండటం సహజం. బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలకు కూడా తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలన్న డిమాండ్లు ఉన్నాయి. ఇక్కడ రాజకీయ నాయకత్వం ఎదుర్కొనే సమస్య ఏమిటంటే.. సామాజిక ప్రాతినిధ్యాన్ని సమతుల్యం చేస్తూనే ఎన్నికల్లో గెలిచిన నాయకుల రాజకీయ బలాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కేవలం సామాజిక వర్గం ఆధారంగా మంత్రి పదవి ఇవ్వడం సరిపోదు. ఆ నాయకుడు పరిపాలనను సమర్థంగా నడపగలడా? శాఖపై అవగాహన ఉందా? ప్రజల్లో విశ్వసనీయత ఉందా? అన్నదీ చూడాలి. సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, పరిపాలనా సామర్థ్యం.. ఈ మూడింటి మధ్య సమతుల్యతే సరైన మంత్రివర్గానికి పునాది.

#### యువతకు అవకాశం.. సీనియర్లకు గుర్తింపు

కాంగ్రెస్‌లో సీనియర్లు చాలామంది ఉన్నారు. అదే సమయంలో కొత్త తరం నాయకులు కూడా బలంగా ఎదుగుతున్నారు. మంత్రివర్గ విస్తరణలో ఈ రెండు వర్గాల మధ్య సమతుల్యత సాధించడం మరో సవాలు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన సీనియర్ నాయకులకు పదవి ఇవ్వాలన్న వాదన బలంగానే ఉంటుంది. మరోవైపు భవిష్యత్ నాయకత్వాన్ని తయారు చేయాలంటే యువతకు అవకాశాలు ఇవ్వాల్సిందే. ఒకరికి అవకాశం ఇచ్చి మరొకరిని పూర్తిగా పక్కన పెట్టడం రాజకీయంగా అంత సులభం కాదు. యువ ఎమ్మెల్యేలకు మంత్రిపదవులు ఇస్తే వారికి పరిపాలనా అనుభవం లభిస్తుంది. భవిష్యత్‌లో పార్టీకి కొత్త నాయకత్వం తయారవుతుంది. సీనియర్లకు అవకాశం ఇస్తే వారి అనుభవాన్ని ప్రభుత్వం వినియోగించుకోగలదు. అందువల్ల ఈ రెండింటినీ కలిపే విధంగా కూర్పు ఉండాలి. అసలు ప్రశ్న వయసు కాదు.. సామర్థ్యం. యువకుడైనా, సీనియర్ అయినా తన శాఖను సమర్థంగా నడపగలిగితేనే పదవికి న్యాయం చేసినట్టవుతుంది.

#### శాఖల మార్పులు.. అసలు ప్రభావం ఇక్కడే

మంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడు కొత్తగా ఎవరు వస్తారన్న దానికంటే ఎవరికేం శాఖ దక్కుతుందన్నది కూడా కీలకం. ఎందుకంటే ఒకే మంత్రి మారినా శాఖ మారకపోతే పరిపాలనలో పెద్దగా మార్పు కనిపించకపోవచ్చు. కానీ కీలకమైన శాఖలకు కొత్త నాయకత్వం వస్తే ప్రభుత్వ పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించే అవకాశం ఉంటుంది. రైతాంగం, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, సంక్షేమం వంటి శాఖలకు సమర్థవంతమైన నాయకత్వం అవసరం. ఒక్కో శాఖకు ఒక్కో రకమైన పరిపాలనా నైపుణ్యం కావాలి. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖలను కూడా పునర్విభజించే అవకాశం ఉందన్న చర్చ ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉంది. అయితే ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు, రాజధాని నగర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని కీలక శాఖలను ముఖ్యమంత్రి తన పర్యవేక్షణలోనే ఉంచుకోవచ్చన్న అంచనాలూ ఉన్నాయి. ఇక్కడ కూడా రాజకీయానికి మించి పరిపాలన ముఖ్యం కావాలి. శాఖ ఎవరికి ఇస్తే ప్రభుత్వానికి ఎక్కువ ఫలితం వస్తుందో అదే నిర్ణయానికి ప్రాతిపదిక కావాలి.

#### అసెంబ్లీ సమావేశాలు.. ప్రభుత్వానికి మరో పరీక్ష

మంత్రివర్గ విస్తరణపై చర్చ జరుగుతున్న సమయంలోనే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటం రాజకీయ ప్రాధాన్యాన్ని మరింత పెంచుతోంది. సభలో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని వివిధ అంశాలపై నిలదీసే అవకాశం ఉంది. ప్రభుత్వం కూడా తన పాలనా ప్రగతిని ప్రజల ముందుంచుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో కొత్త మంత్రులు బాధ్యతలు చేపడితే వారికి వెంటనే తమ శాఖలపై పట్టు సాధించాల్సిన అవసరం ఉంటుంది. సభలో ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం, విధాన నిర్ణయాలను వివరించడం, ప్రతిపక్ష విమర్శలను తిప్పికొట్టడం వంటి బాధ్యతలు ఎదురవుతాయి. అందుకే మంత్రివర్గ విస్తరణను సభా సమావేశాలకు అనుగుణంగా కూడా చూడాల్సి ఉంటుంది. కొత్త మంత్రులు రాజకీయంగా మాత్రమే కాకుండా పరిపాలనా పరంగానూ సిద్ధంగా ఉండాలి.

#### పదవుల కోసం పోటీ.. అసంతృప్తిని ఎలా ఎదుర్కొంటారు?

**మంత్రిపదవి దక్కని ఎమ్మెల్యేల్లో అసంతృప్తి రావడం సహజం. ముఖ్యంగా చాలాకాలంగా ఆశలు పెట్టుకున్న నాయకులకు అవకాశం రాకపోతే వారు బహిరంగంగా మాట్లాడకపోయినా అంతర్గతంగా అసంతృప్తి ఉండవచ్చు. అధికార పార్టీలో ఇది పెద్ద సవాలు. ఎందుకంటే ప్రభుత్వం శాసనసభలో సంఖ్యాబలంతో ఉన్నప్పటికీ.. ప్రతి ఎమ్మెల్యే రాజకీయంగా ముఖ్యమే. వారి నియోజకవర్గాల్లో పార్టీ భవిష్యత్ బలం వారి పనితీరుపైనే ఆధారపడి ఉంటుంది. అందుకే మంత్రిపదవి రాని వారికి ఇతర బాధ్యతలు ఇవ్వడం, పార్టీ సంస్థాగత పదవుల్లో అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ కమిటీల్లో భాగస్వామ్యం చేయడం వంటి మార్గాల ద్వారా అసంతృప్తిని తగ్గించాల్సి ఉంటుంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవి దక్కని నాయకులను దూరం చేసుకోవడం ఎంత ప్రమాదకరమో.. పదవి ఇచ్చిన వారితోనే పార్టీ నడుస్తుందని భావించడం కూడా అంతే ప్రమాదకరం.**

#### కొండా సురేఖ అంశం.. నిర్ణయం ఎలా ఉంటుందో?

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చర్చ మధ్య కొండా సురేఖకు సంబంధించిన రాజకీయ పరిణామాలు కూడా ఆసక్తిని రేపుతున్నాయి. ఆమె వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి పెట్టినట్లు వచ్చిన వార్తలు మంత్రివర్గ చర్చలకు అదనపు రాజకీయ కోణాన్ని తెచ్చాయి. ఒకవేళ ఆమె విషయంలో ఏదైనా నిర్ణయం తీసుకుంటే అది కేవలం ఒక మంత్రి విషయంలో తీసుకున్న నిర్ణయంగా మిగలదు. పార్టీ క్రమశిక్షణ, మంత్రుల ప్రవర్తన, ప్రభుత్వ ప్రతిష్ఠ వంటి అంశాలపై కూడా ఒక సంకేతంగా మారుతుంది. అయితే ఇలాంటి సున్నితమైన వ్యవహారాల్లో తుది నిర్ణయం ఊహాగానాల ఆధారంగా కాకుండా పార్టీ అంతర్గత చర్చల తర్వాతే వెలువడాలి. వ్యక్తిగత వివాదాలను ప్రభుత్వ పాలనా వ్యవహారాలతో కలపకుండా, ప్రతి నిర్ణయానికి స్పష్టమైన రాజకీయ, పరిపాలనా ప్రాతిపదిక ఉండాలి.

#### ప్రజల ప్రశ్న మాత్రం చాలా సూటిగా ఉంది

**ఇంత రాజకీయ చర్చ జరుగుతున్నా ప్రజల ఆలోచన మాత్రం చాలా సరళమైనది. మంత్రివర్గంలో ఎవరు వస్తారన్నదానికంటే తమ సమస్యలు పరిష్కారం అవుతాయా లేదా అన్నదే వారికి ముఖ్యం. రైతుకు రుణం, సాగునీరు, పంటకు గిట్టుబాటు ధర వంటి సమస్యలు ఉన్నాయి. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తోంది. నిరుద్యోగులు ప్రభుత్వ నియామకాల కోసం ఆశగా చూస్తున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కావాలి. పేదలకు ఇళ్లు, సంక్షేమ పథకాలు సకాలంలో అందాలి. పట్టణ ప్రజలకు రహదారులు, ట్రాఫిక్, పారిశుధ్యం, మౌలిక వసతులు మెరుగుపడాలి. పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉండాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందుబాటులో ఉండాలి. ఇవి పరిష్కరించడానికి మంత్రి ఎవరు అన్నదానికంటే మంత్రి ఎలా పనిచేస్తారన్నదే ముఖ్యం. అందుకే కొత్త మంత్రివర్గానికి ప్రజల అంచనాలు చాలా ఎక్కువగా ఉంటాయి. పదవి స్వీకరించిన తర్వాత మొదటి కొన్ని నెలల్లోనే తమ శాఖలో మార్పు కనిపించేలా చేయాల్సి ఉంటుంది.**

#### మంత్రివర్గానికి పనితీరు కొలమానం అవసరం

ఇకపై మంత్రి పదవి రాజకీయ గౌరవానికి మాత్రమే పరిమితం కాకూడదు. ప్రతి శాఖకు కొలిచే లక్ష్యాలు ఉండాలి. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు ఎన్ని అమలయ్యాయి? ఎన్ని కుటుంబాలకు ప్రయోజనం అందింది? పెండింగ్ సమస్యలు ఎంతవరకు పరిష్కరించబడ్డాయి? పెట్టుబడులు ఎంత వచ్చాయి? ఉద్యోగాలు ఎంతమందికి లభించాయి? ప్రజా సేవలు ఎంత వేగంగా అందుతున్నాయి? అన్నదానిపై నిరంతర సమీక్ష అవసరం. మంత్రుల పనితీరును కేవలం పార్టీ సమావేశాల్లోనే కాకుండా ప్రజల అనుభవాల ఆధారంగా కూడా అంచనా వేయాలి. అధికార యంత్రాంగం నుంచి వచ్చే నివేదికలతోపాటు క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవాలి. అప్పుడే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు నిజమైన అర్థం ఉంటుంది.

#### రేవంత్‌రెడ్డికి ఇది రాజకీయంగా కీలక మలుపు

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు పాలనలో కీలక దశలో ఉంది. ప్రారంభ దశలో ఉన్న రాజకీయ ఉత్సాహం క్రమంగా పరిపాలనా ఫలితాలుగా మారాల్సిన సమయం ఇది. ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, పెట్టుబడులు, ఉద్యోగాలు వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన ఫలితాలు చూపించాల్సి ఉంది. ఇలాంటి సమయంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగితే అది ప్రభుత్వానికి ఒక కొత్త ఆరంభంగా మారవచ్చు. ఇప్పటివరకు పనిచేసిన విధానాన్ని సమీక్షించుకుని.. లోపాలను సరిదిద్దుకుని.. కొత్త బృందంతో ముందుకు వెళ్లే అవకాశం లభిస్తుంది. కానీ అందుకు ముఖ్యమంత్రి ఒక కఠినమైన నిర్ణయం తీసుకోవాలి. రాజకీయంగా ఉపయోగపడేవారినే కాదు.. పరిపాలనలో ఫలితాలు చూపించగలిగేవారిని ఎంపిక చేయాలి. అది చేయగలిగితే మంత్రివర్గ విస్తరణ కాంగ్రెస్‌కు కూడా ప్రయోజనం. ప్రభుత్వానికి కూడా బలం. ప్రజలకు కూడా ఆశ.

#### చివరికి నిలిచేది పదవి కాదు.. పనితీరే

**మంత్రివర్గ విస్తరణపై ప్రస్తుతం ఎన్ని పేర్లు వినిపించినా.. ఎన్ని ఊహాగానాలు వచ్చినా.. తుది నిర్ణయం వెలువడే వరకు అవన్నీ రాజకీయ చర్చలే. ఎవరు మంత్రి అవుతారు? ఎవరికి ఏ శాఖ వస్తుంది? ఎవరు తప్పుకుంటారు? అన్నది త్వరలోనే తేలిపోవచ్చు.**

**కానీ అసలు కథ అక్కడితో ముగియదు. అప్పుడే మొదలవుతుంది.**

కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రి తన శాఖను ఎంత సమర్థంగా నడిపిస్తారు? ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎంత వేగంగా తీసుకెళ్తారు? సమస్యలను ఎంత త్వరగా పరిష్కరిస్తారు? అధికార యంత్రాంగాన్ని ఎంత సమర్థంగా నడిపిస్తారు? ప్రజలకు ఎంత అందుబాటులో ఉంటారు? అన్నదే ఆయన పదవికి అసలు పరీక్ష. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా ఇదే పరీక్ష. రాజకీయ సమీకరణాలను సమతుల్యం చేయడం అవసరం. పార్టీ అధిష్ఠానంతో సమన్వయం అవసరం. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం. కానీ వీటన్నింటికంటే పైగా పాలనా సామర్థ్యాన్ని ముందుకు పెట్టడం అత్యవసరం. ఎందుకంటే మంత్రివర్గం పార్టీ కోసం కాదు.. ప్రభుత్వం కోసం. ప్రభుత్వం నాయకుల కోసం కాదు.. ప్రజల కోసం. అందువల్ల తెలంగాణలో జరగబోయే మంత్రివర్గ విస్తరణను పదవుల పందేరంగా కాకుండా పాలనకు కొత్త దిశను నిర్దేశించే అవకాశంగా చూడాలి. రెండున్నరేళ్ల పాలన తర్వాత ప్రజల అంచనాలు కూడా మారాయి. ఇప్పుడు వారికి హామీల కంటే ఫలితాలు కావాలి. ప్రకటనల కంటే అమలు కావాలి. రాజకీయ మాటల కంటే పరిపాలనా చర్యలు కావాలి. రేవంత్‌రెడ్డి ఆ అంచనాలను అర్థం చేసుకుని మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరిస్తే.. ఈ నిర్ణయం ఆయన ప్రభుత్వానికి కొత్త శక్తిని ఇవ్వగలదు. సమర్థతకు పెద్దపీట వేస్తే.. అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వానికి బలం చేకూరుతుంది. ప్రజలకు జవాబుదారీగా పనిచేసే బృందాన్ని ఏర్పాటు చేస్తే.. వచ్చే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది. లేకపోతే మంత్రివర్గ విస్తరణ మరో రాజకీయ వార్తగా మిగిలిపోతుంది.

అందుకే ఇప్పుడు తెలంగాణ ఎదురు చూస్తున్నది కొత్త మంత్రుల జాబితా కోసం మాత్రమే కాదు. కొత్త పాలనా ఫలితాల కోసం.

**పదవులు మారడం కాదు.. పనితీరు మారాలి.**

**ముఖాలు మారడం కాదు.. ప్రజలకు కనిపించే ప్రభుత్వం మారాలి.**

**అప్పుడే మంత్రివర్గ విస్తరణకు అసలు అర్థం.**



గుర్రం పాపిరెడ్డి.
ఎడిటర్

# మున్సిపాలిటీ గెలుపుపై నాయకుల గురి.. అభివృద్ధిపై ప్రజల గురి

### ఎన్నికల కసరత్తు ఒకవైపు.. ధర్మవరం భవిష్యత్తుపై ప్రజల ఆశ మరోవైపు




**ధర్మవరం, సెప్టెంబరు 2 (అరుణ ప్రభ న్యూస్)**

ధర్మవరం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, గెలుపు వ్యూహాలపై కసరత్తు మొదలైంది. మున్సిపాలిటీపై ఆధిపత్యం సాధించేందుకు రాజకీయ లెక్కలు వేస్తున్న వేళ.. ప్రజల దృష్టి మాత్రం తమ పట్టణ భవిష్యత్తు, అభివృద్ధిపైనే ఉండాల్సిన అవసరం ఉంది. చైర్మన్ ఎవరు? ఏ పార్టీ గెలుస్తుంది? ఏ వార్డులో ఎవరి బలం ఎంత? అనే రాజకీయ చర్చ సహజమే. కానీ ఎన్నికల తర్వాత ప్రజలకు ఎదురయ్యేది రాజకీయ సమీకరణాలు కాదు.. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం, చెత్త నిర్వహణ, వీధిలైట్లు, పట్టణ ప్రణాళిక, భవన అనుమతులు, మున్సిపల్ ఆస్తుల పరిరక్షణ వంటి రోజువారీ సమస్యలు.

అందుకే ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రసంగాల కంటే వారి అభివృద్ధి ప్రణాళిక, గత పనితీరు, ప్రజా సమస్యలపై అవగాహనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రతి వార్డులోని సమస్యలను గుర్తించి.. వాటికి ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించి.. కాలపరిమితితో కూడిన అభివృద్ధి ప్రణాళికను ప్రజల ముందుంచడం కీలకం.

ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకుల మాటలు వినడం మాత్రమే కాకుండా.. తమ వార్డులో గతంలో జరిగిన పనులు, ఇంకా పరిష్కారం కాని సమస్యలు, కొత్తగా చేయాల్సిన పనులపై ప్రజలు స్పష్టత కోరే పరిస్థితి రావాలి.

పాలకవర్గం మారినా.. అధికారులు మారినా.. ప్రజల సమస్యల పరిష్కారంపై పాలనలో నిరంతరత ఉండాలి. గతంలో జరిగిన పనులను సమీక్షించి, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల స్థితిని తెలుసుకుని, భవిష్యత్తు పనులకు స్పష్టమైన ప్రాధాన్యత క్రమాన్ని రూపొందించడం కొత్త పాలకవర్గం ముందున్న ప్రధాన బాధ్యత.

**అరుణ ప్రభ విశ్లేషణ:**

ఎన్నికల్లో గెలుపు రాజకీయ పార్టీల లక్ష్యం కావచ్చు. కానీ ప్రజలకు కావాల్సింది తమ పట్టణ అభివృద్ధి.

**పార్టీ ఏదైనా.. అభివృద్ధి ప్రజల హక్కు. పదవి ఎవరికైనా.. జవాబుదారీతనం తప్పనిసరి.**

**రేపటి కథనంలో..**

**నిధులు.. పనులు.. లెక్కలు!**

ధర్మవరం మున్సిపాలిటీకి వచ్చే నిధులు, వాటి కేటాయింపులు, చేపట్టిన పనులు, ఖర్చుల వివరాలు ప్రజలకు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి?

**మున్సిపల్ వెబ్‌సైట్ పారదర్శకత నుంచి నిధులు--పనుల పూర్తి వివరాల వరకు.. "అరుణ ప్రభ" ప్రత్యేక కథనం.**

# ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు





కూకట్‌పల్లి: జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లోని పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యుడు, కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ఆధ్వర్యంలో జనసైనికులు, పవన్ కల్యాణ్ అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం గోపాల్‌నగర్‌లో యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాన శిబిరం వద్ద జనసైనికుల సమక్షంలో మరోసారి కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

**తెలంగాణలో జనసేన బలోపేతం**

ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మాట్లాడుతూ.. జనసైనికులు, పవన్ కల్యాణ్ అభిమానులు కూకట్‌పల్లి నియోజకవర్గంలో రాత్రి నుంచే వివిధ కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పవన్ కల్యాణ్ పాలనా విధానం, ప్రజా సంక్షేమంపై ఆయన ఆలోచనలు, జనసేన పార్టీ సిద్ధాంతాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేన పార్టీ క్రమంగా బలోపేతమవుతోందని ప్రేమకుమార్ అన్నారు. పార్టీ



సిద్ధాంతాలు, పవన్ కల్యాణ్ ఆశయాల పట్ల ఆకర్షితులై పాలక, ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు చిన్న, పెద్ద నాయకులు జనసేన వైపు చూస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో జనసేన పార్టీ మరింత బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, పవన్ కల్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైయస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

### నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక చారిత్రాత్మక పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పేదల సంక్షేమ రంగాల్లో వైఎస్సార్ తీసుకున్న నిర్ణయాలు నేటికీ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ చూపిన బాటలో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని సంజీవరెడ్డి తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ పేదలు, రైతులు, మహిళలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే ఆయనకు అందించే



నిజమైన నివాళి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పటేల్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు సుబ్బార్, గోపాల్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు ముంతాజ్, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు జూలా నాయక్, తాహెర్, కిషన్ నాయక్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు.



### న్యామద్దలలో రీ-సర్వే పనులను పరిశీలించిన జేసీ మౌర్య భారద్వాజ్

ధర్మవరం, సెప్టెంబరు 2 (అరుణ ప్రభ న్యూస్): న్యామద్దల గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులను జాయింట్ కలెక్టర్ మౌర్య భారద్వాజ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూ వివరాల నమోదు, సరిహద్దుల నిర్ధారణ, రీ-సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను మార్గదర్శకాలకు అనుగుణంగా, తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ఎఫ్‌పీ షాపును తనిఖీ చేసి సరుకుల నిల్వలు, పంపిణీపై వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులను నిర్ణీత పరిమాణంలో సకాలంలో అందించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ కార్యకలాపాలు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ దరఖాస్తులు, వినతుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ప్రజల వినతులను గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ, తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



### నిజాంపేట్ మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : నిజాంపేట్ మండల పరిషత్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ఎమ్మెల్యే గారు సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మాట్లాడుతూ నిజాంపేట్ మండలానికి ప్రభుత్వ మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు రాజుబౌ×చీ పరిశ్రమను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. అలాగే మండలంలోని మహిళా సంఘాలకు పెట్రోల్ పంప్ మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు, సర్పంచులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రైతుల సమస్యలు, రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, మిషన్ భగీరథ, విద్యుత్ సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల సమస్యలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, సంబంధిత సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గారు అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. "గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయి. గ్రామాభివృద్ధికి నా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు అన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా అందజేయడం జరిగింది ఈ సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, నిజాంపేట్ మండల ప్రత్యేక అధికారి నూతన్ కుమార్. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగారెడ్డి. బాచుపల్లి సర్పంచ్ శ్రీకాంత్. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



### మరపురాని మహా నేత డాక్టర్ వైఎస్సార్ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలను చేపట్టాయి. స్థానిక పీవీఆర్ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ ఇంచార్జి బూదూరు గురవయ్య ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా, యువత పార్టీ అభిమానులు విశేష స్పందనతో తరలివచ్చి రక్తదానం చేశారు. ?ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత మహానేత వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి సాగించిన పాలనను కొనియాడారు. ఆయన ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచే గొప్ప మహానేత అని పేర్కొన్నారు. గూడూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన నాయకులు, అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అలాగే భారీ అన్నదాన కార్యక్రమాలు చేపట్టి పేదలకు భోజనాలు వడ్డించారు. ?ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు యద్దల నరేంద్రరెడ్డి , కోడూరు మీరారెడ్డి, బత్తిని విజయకుమార్, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, అట్లా శ్రీనివాసులు రెడ్డి , మనుబోలు కృష్ణయ్య , వేమారెడ్డి కుమారస్వామి రెడ్డి,భక్తవత్సల రెడ్డి, అక్కుపల్లి శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

### శ్రీ గాయత్రి విద్యార్థి ప్రతిభ

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలోని న్యూ బాలాజీ నగర్ లో ఏర్పాటై ఉన్న శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి మోక్షిత్ రావు తిరుపతిలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్షిప్ 2026 పోటీల్లో హాకీ నందు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, మోక్షిత్ రావుకు మెడల్ తో పాటు కప్పును అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ... శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రత్యేకమైన తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని,జాతీయస్థాయి క్రీడా పోటీల్లో అద్భుతంగా రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుప్రజ, మస్తాన్ బి, రేవంతి,భవాని, రజిని,పర్వీన్,నాసిరా, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.. ధర్మవరంలో జనసేన బైక్ ర్యాలీ



ధర్మవరం, సెప్టెంబరు 2 (అరుణ ప్రభ న్యూస్): జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ధర్మవరం పట్టణంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రత్యేక స్క్రీన్‌పై ప్రసారమైన కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. పార్టీ కార్యాలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

# సర్వే కోసం ఏళ్లుగా ఎదురుచూపులు!

## రెవెన్యూ కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు.. కలెక్టర్ జోక్యం కోరుతున్న రావులచెరువు వాసులు



ధర్మవరం రూరల్, సెప్టెంబరు 2; (అరుణ ప్రభ న్యూస్): తమ భూమికి పూర్తిస్థాయి సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించి న్యాయం చేయాలని కోరుతూ రావులచెరువు గ్రామానికి చెందిన బాధితులు ఏళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పలుమార్లు అర్జీలు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించి తమ భూ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. బాధితుల వివరాల మేరకు.. రావులచెరువు గ్రామానికి చెందిన కురుబ పెద్ద ఎల్లప్పకు గతంలో సుమారు 10 ఎకరాల పట్టా భూమి ఉన్నట్లు తెలిపారు. ఆయనకు ఐదుగురు కుమారులు ఉండగా ఒక్కొక్కరికి రెండేసి ఎకరాల చొప్పున భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఐదుగురిలో ఒకరైన ఎల్లప్ప తనకు చెందిన రెండు ఎకరాల 20 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన దాది నరసింహారెడ్డికి విక్రయించినట్లు తెలిపారు. అయితే మిగిలిన నలుగురికి చెందిన భూమిపై కూడా హక్కు కల్పించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌లకు పలుమార్లు అర్జీలు సమర్పించినట్లు తెలిపారు. స్పందించిన జిల్లా కలెక్టర్ భూ సమస్యను పరిష్కరించాలని ఆర్డీఓ, తహసీల్దార్, మండల సర్వేయర్‌లను ఆదేశించినట్లు బాధితులు పేర్కొన్నారు. అయినప్పటికీ ధర్మవరం మండల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తమ సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపించారు. గతంలో సర్వేయర్లు భూమిని పరిశీలించినప్పటికీ పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించలేదని వాపోయారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పీజీఎస్‌లోనూ ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. తాజాగా తహసీల్దార్ కార్యాలయం నుంచి బుధవారం భూమిని సర్వే చేస్తామని నోటీసు అందినట్లు బాధితులు చెప్పారు. దీంతో ఉదయం 10 గంటల నుంచే సర్వేయర్‌కు ఫోన్ చేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ పలుమార్లు సర్వే చేస్తామని హామీలు ఇచ్చినా అమలు కాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సర్వే నంబర్ 458-3లోని భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేయించి, హద్దులు నిర్ధారించి, తమకు న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అక్కపల్లిలో నూతన అర్బన్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 2: ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపల్లి గ్రామంలో నూతన అర్బన్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేరా బేగం గౌస్ ముఖ్యఅతిథిగా హాజరై ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పాలకవర్గం విజ్ఞప్తి మేరకు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసిన ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూడిది రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, ఉపసర్పంచ్ మందాటి బాబు, పాలకవర్గ సభ్యులు, అక్కపల్లి గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు జంగా భూమిరెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. విద్యుత్ శాఖకు చెందిన లైన్‌మన్ లక్ష్మీరాజం, విద్యుత్ ఇన్‌స్పెక్టర్ రమేష్, అక్కపల్లి హెల్పర్ పోశయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి, ఏర్పాటు చేయడంలో సహకరించిన విద్యుత్ శాఖ అధికారులకు గ్రామ పాలకవర్గం, ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## వైయస్ సేవలు మరువలేనివి

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 2: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పదిహేడో వర్ధంతి వేడుకలు బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడిద రాజేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.కె. సాబేరాబేగం మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి దార్శనికుడని కొనియాడారు. ఆయన ముఖ్యమంత్రిగా అందించిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేశారని పేర్కొన్నారు. రైతన్నలకు బాసటగా నిలిచిన మహనీయుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసిన ఆయనను అపర భగీరథుడిగా ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి నిలిచిపోయారని సాబేరాబేగం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి, సర్పంచులు కల్లూరు బాపురెడ్డి, మామిళ్ల కిషన్, నాగెల్లి వెంకటరెడ్డి, చిద్రం నాగరాజు, జిల్లా నాయకులు ఎస్.కె. సాహెబ్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, వంగ గిరిధర్ రెడ్డి, చెన్ని బాబు, గంట బుచ్చగౌడ్, వెంకటేష్ మూర్తి, అనవేని రవి, లక్ష్మారెడ్డి, కొండాపురం శ్రీనివాస్ రెడ్డి, గొల్లపల్లి మల్లేశం, మేడిపల్లి దేవానందం, నంది కిషన్, బండారి బాల్ రెడ్డి, తేజ శ్రీనివాస్, గుర్రాల రాజిరెడ్డి, రఫీక్, గంట అంజయ్య, రాజ్ కుమార్, చంద్రారెడ్డి, అలియాస్, శ్రీకాంత్ రెడ్డి, సత్యనారాయణ, శ్రీపాల్ రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల కోసం ఉద్యమ శంఖారావం

## రెడ్డి కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించాలి - రైతు బీమా కొనసాగించాలి

### 15 ఎకరాల భూమిని వెంటనే తిరిగి అప్పగించాలి

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 2: రెడ్డి సామాజిక వర్గం సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న ఒకరోజు నిరాహార దీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఎల్లారెడ్డిపేట మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు కుంభాల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల సంఘ భవనంలో నిర్వహించనున్న నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.1,000 కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు అండగా నిలిచే రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని కోరారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రాజబహద్దూర్ వెంకటరామిరెడ్డి ట్రస్ట్ కోసం కేటాయించిన 15 ఎకరాల భూమిని ప్రస్తుత ప్రభుత్వం తిరిగి తీసుకోవడం అన్యాయమని అన్నారు. ఆ భూమిని వెంటనే తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అన్ని విభాగాల్లో



సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. రెడ్డి సామాజిక వర్గం హక్కులు, సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ఒకరోజు నిరాహార దీక్షకు రెడ్డి సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం నాయకులు పారిపల్లి సంజీవరెడ్డి, వంగ శ్రీకాంత్‌రెడ్డి, గుర్రాల చంద్రమోహన్‌రెడ్డి, గోపూరి ప్రదీప్‌రెడ్డి, నేవూరి శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎస్కేయూ ఫలితాల్లో శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల సత్తా

ధర్మవరం, సెప్టెంబర్ 2; (అరుణ ప్రభ న్యూస్): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రకటించిన మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ధర్మవరం ఎల్‌పీ సర్కిల్‌లోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. వివిధ గ్రూపుల్లో పలువురు విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల కరెస్పాండెంట్ జగదీష్, ప్రిన్సిపాల్ మల్లికార్జున తెలిపారు. బీఎస్సీ స్టాటిస్టిక్స్‌లో నీలిమ, వీణ, దివ్య, అంజలీబాయి 100 శాతం మార్కులతో నిలిచారు. బీకాం కంప్యూటర్స్‌లో దివ్యలక్ష్మి 93 శాతం, బీఎస్సీ కంప్యూటర్స్‌లో దీపిక 91 శాతం, బీబీఏలో రోషిణి 85 శాతం మార్కులు సాధించారు. మొత్తం 97 మంది విద్యార్థినులు 75 శాతానికి పైగా (డిస్టింక్షన్) సాధించడం విశేషమన్నారు. విజయవంతమైన విద్యార్థినులకు ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ మిఠాయిలు పంచి అభినందించారు. ఫలితాల కోసం కృషి చేసిన అధ్యాపకులను వారు అభినందించారు.

## కోతుల బెడద నివారించాలి

### దాడుల్లో ఇద్దరికి గాయాలు.. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స





అరుణప్రభ న్యూస్, ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 2: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేట, ఇందిరమ్మ కాలనీలో కోతుల బెడద తీవ్రంగా ఉందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల గుంపులు ఇళ్లలోకి చొరబడటంతో పాటు, రోడ్లపై సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఇటీవల కోతుల దాడిలో ఇందిరమ్మ కాలనీకి చెందిన శ్రీరామ్ లక్ష్మితో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. గాయపడిన ఇద్దరూ సిరిసిల్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. కోతుల బెడద కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ఇద్దరిపై దాడి జరిగిన నేపథ్యంలో భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు సంభవించకముందే గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది, పాలకవర్గం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కిషన్‌దాస్‌పేట, ఇందిరమ్మ కాలనీలో కోతుల బెడదను పూర్తిస్థాయిలో నివారించేందుకు సంబంధిత శాఖల సహకారంతో చర్యలు తీసుకోవాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని కాలనీ వాసులు ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, ఈవోను కోరుతున్నారు.



## విద్యార్థినులకు స్టిక్‌లు పంపిణీ

గూడూరు - (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు రెండో పట్టణంలోని ఎస్టీ మినీ గురుకుల పాఠశాల (బాలికలు) విద్యార్థినులకు శ్రీ కృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్, తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు జీవన్ దాన్ అవయవదాన్ డోనార్ డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ 16 జతల కోలాటం స్టిక్స్ ను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ విద్యతో పాటు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల విద్యార్థులలో బెరుకుతనం పోయి, భవిష్యత్తులో ఉన్నత చదువులు ఉద్యోగాలలో పర్సనాలిటీ డెవలప్ మెంట్ కు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కృష్ణ దర్శనం పోటీలలో చక్కగా ప్రదర్శన ఇవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల హెడ్ మాస్టర్ కె.వి. రజని కుమారి గారు మాట్లాడుతూ - పిల్లలు క్రమశిక్షణతో విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటే భవిష్యత్తులో ధైర్యంగా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లావణ్య ,పిఈటి నాగూరమ్మ, పద్మ , చంద్ర , వనమ్మ , లలిత , రమణమ్మ , రాజేశ్వరి , కల్పన , నాన్ టీచింగ్ స్టాఫ్ , విద్యార్థినులు పాల్గొన్నారు.



## హామీ నిలబెట్టుకున్న మంత్రి సత్యకుమార్

### పీసీ రేవులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ముదిగుబ్బ, సెప్టెంబరు 2; (అరుణ ప్రభ న్యూస్): 2024 ఎన్నికల ప్రచారంలో పీసీ రేవు గ్రామ ప్రజలకు ఇచ్చిన తాగునీటి సమస్య పరిష్కార హామీని మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అమలు చేశారు. గ్రామంలో తాగునీటి వసతి కోసం మండల పరిషత్ నిధుల నుంచి రూ.6.50 లక్షలు కేటాయించి నూతన బోరు, మోటారు, పైపులైన్ తదితర పనులు పూర్తి చేశారు. బుధవారం ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ ఆధ్వర్యంలో నీటి సరఫరాను ప్రారంభించారు. దీంతో గ్రామస్థుల దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయడంపై గ్రామస్థులు మంత్రి సత్యకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో హాజీవ్ అలీ, టీడీపీ మండల కన్వీనర్ ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రసాద్, సర్పంచ్ నాగభూషణ, ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

### 40 కిలోల ప్లాస్టిక్ స్వాధీనం.. రూ.15 వేల జరిమానా



ధర్మవరం, సెప్టెంబరు 2; అరుణ ప్రభ న్యూస్: నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలను అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలతో కలిసి మార్కెట్ స్ట్రీట్, జేజేఆర్ నగర్, పి.ఆర్.టి. స్ట్రీట్, ఇందిరానగర్ వార్డుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న వ్యాపారుల వద్ద నుంచి సుమారు 40 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు మొత్తం రూ.15 వేల జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి కలిగే నష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని అధికారులు సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలను పూర్తిగా అరికట్టే వరకు పట్టణంలో ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

## 9వ వార్డు బీజేపీ ఇంచార్జ్ గా ఏకిల రామానాయుడు



ధర్మవరం, సెప్టెంబరు 2; అరుణ ప్రభ న్యూస్: మంత్రి, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ధర్మవరం పట్టణంలోని 40 వార్డులకు బీజేపీ ఇంచార్జ్ లను నియమించారు. ఇందులో భాగంగా 9వ వార్డు ఇంచార్జ్ గా ఏకిల రామానాయుడిని నియమించారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల శేఖర్, నియోజకవర్గ ఇంచార్జ్ ఖగ్గోలు హరీష్, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్‌లకు రామానాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా ప్రకటించాలి



అరుణ ప్రభ, దిండి ,సెప్టెంబర్ 1,తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రతి గ్రామపంచాయతీని స్వతంత్ర రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలని, ఆయా గ్రామాలకు ప్రత్యేక రెవిన్యూ గ్రామ హోదా కల్పించాలని, దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని దిండి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు చింతలపూడి భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మనవి చేశారు.నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు రెవెన్యూ గ్రామ హోదా లేకపోవడంతో భూములకు సంబంధించిన రికార్డులు, పట్టాదారు పాసు బుక్కులు, భూ రికార్డులు, భూ సర్వే, ఇతర రెవిన్యూ సర్వీస్ కోసం మరో రెవిన్యూ గ్రామం పై ఆధార పడవలసి వస్తుందని ఆయన అన్నారు.నూతన గ్రామపంచాయతీలను నూతన రెవిన్యూ గ్రామా లుగా గుర్తించి, ప్రత్యేక రెవిన్యూ రికార్డులు సరిహద్దులు అవసరమైన పరిపాలన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన






ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 2 (అరుణప్రభ): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల పట్టణంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ బాకీ కార్డుల పంపిణీతో పాటు 420 అడుగుల భారీ ఫ్లెక్స్‌ను ప్రదర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగారావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, సింగిల్ విండో ఛైర్మన్లు, సెస్ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# దిండిలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు




అరుణ ప్రభ ,డిండి, సెప్టెంబర్ 2,దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని దిండి మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై స్థానిక ఎస్సై బాలక్రిష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంలో ఎస్సై మాట్లాడుతూ, సైబర్ క్రైమ్, మైనర్ డ్రైవింగ్, గంజాయి, ఫోక్సో యాక్ట్ ,బాల్య వివాహాలు, మొదలైన అంశాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు .గంజాయి లాంటి మత్తు పదార్థాలు తీసుకోవడం వలన శరీరం నాశనమవుతుందని, అనారోగ్య సమస్యలు వస్తాయని ,మత్తుకు దూరంగా ఉండాలని, విద్యార్థులు చిన్న వయసులోనే ప్రేమ పేరుతో జీవితా లు చిన్నాభిన్నం చేసుకోవద్దని, సోషల్ మీడియాలో పరిచయం అయిన అపరిచిత వ్యక్తులకు ఓటీపీలను పంచుకోవద్దని ,బెట్టింగ్లకు దూరంగా ఉండాలని అన్నారు.మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలు నడపకూడదని ,ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని ,హెల్మెట్ విధిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, శ్రీలత, బిచ్చయ్య, సుశీల రమ, కోదండ రామారావు, విజయకుమార్, వెంకటేశ్వర్లు, చెన్నయ్య ,రవి, విజయ్, బాలకృష్ణ ,రమేష్ ,జ్యోతి, అశ్విని, సందీప్, ధనలక్ష్మి, తరుణ్, తేజ్, నారిమల్ల ప్రవల్లిక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కవితపై అసభ్యకర పోస్టులు పెట్టిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

## పోలీసులకు ఫిర్యాదు చేసిన టీఆర్ఎస్ నాయకులు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 2 : తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత కల్వకుంట్ల కవితను ఉద్దేశించి సోషల్ మీడియా వేదికగా అసభ్యకర, అవమానకర వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీస్ కానిస్టేబుల్ కె. అనిల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మజీద్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా మజీద్‌తో పాటు మహిళా నాయకులు కదిరే రేణుక, ఆకారం పుష్పలత, మల్లవ్వ, యువ నాయకుడు జావిద్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కవిత పాంచజన్య సంకల్ప సభ విజయవంతం కావడం, సభకు భారీగా ప్రజలు హాజరుకావడం కొంతమందికి జీర్ణించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల్లో కవితను ఉద్దేశించి అభ్యంతరకర, అసభ్యకర వ్యాఖ్యలు ప్రచారం చేయడం హేయమైన చర్య అని వారు పేర్కొన్నారు. మహిళా నాయకురాలి గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ అనిల్‌పై చట్టప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత సోషల్ మీడియా పోస్టులకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు, యూఆర్ఎల్‌లు, ఖాతా వివరాలు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని పోలీసులను కోరారు. అవసరమైతే సంబంధిత ఎలక్ట్రానిక్ పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించి వాస్తవాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేశారు. నిందితుడు పోలీస్ శాఖలో పనిచేస్తున్నందున శాఖాపరమైన విచారణ కూడా చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు, డీజీపీ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు కదిరే భాస్కర్ గౌడ్, మార్వాడి దేవరాజు, ఓర్సు అశోక్, శ్రీహరి, భూపతి, బద్రి, పరశురాములు, కొర్రి రమేష్, రాజిరెడ్డి, వినోద్, భాష, సిద్ధూ, అందే పరుశరాములు, బాబు, రాము, సుశాంత్, అనిల్, సురేష్, చందు, కుర్ర సాయి, గౌరీగారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజుల పాలన ప్రజలపై భారం



సెప్టెంబర్ 2, అరుణ ప్రభ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం బోడుప్పల్ ఘనంగా జరిగింది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు.. మాజీ ఎంపీటీసీ మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రజలకు మరోసారి గుర్తు చేస్తూ 420 మీటర్ల భారీ ఫ్లెక్సీతో 420 హామీల తో ఫ్లెక్సీని ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాల్సిన హామీలు, బాకీగా ఉన్న హామీలను వివరిస్తూ బాకీ కార్డులు, కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తాగునీరు, విద్యుత్ వంటి కనీస అవసరాల విషయంలో కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పథకాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు.మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ 420 హామీలను ప్రజల ముందుంచి.. వాటి అమలు పరిస్థితిని ప్రజలకు వివరించడమే,ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని రాబోయే ఏడు రోజుల పాటు రోజుకొక నిరసన కార్యక్రమం నిర్వహించి.. ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పార్టీ జనరల్ సెక్రటరీ మీసాల కృష్ణ, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, రాంచంద్రారెడ్డి, కాటం రాజిరెడ్డి, బందారం శ్రీధర్ గౌడ్, శత్రుజ్ఞ,యూత్ నాయకులు ఉప్పరి విజయ్, సంతోష్, నర్సింగ్ రావు, ధనుష్,శ్రీకాంత్, మహిళలు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసుల పరిష్కారం పకడ్బందీగా చేపట్టాలి



రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 2: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఎస్ఐఆర్--2026 నోటీసుల విచారణ, పరిష్కార ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని బండ్లగూడ, హైదర్‌షాకోట్, శివరాంపల్లి ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్‌రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విచారణ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, ఆధారాల ధ్రువీకరణ తదితర అంశాలను వారు స్వయంగా పరిశీలించారు. జిల్లాలో 'నో మ్యాపింగ్', 'అసాధారణతలు' కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధ్రువీకరణను పకడ్బందీగా చేపట్టాలని సుదర్శన్‌రెడ్డి సూచించారు. విచారణకు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను ధ్రువీకరించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను ఆదేశించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు. విచారణ ప్రక్రియలో సంబంధిత పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన, ధ్రువీకరణ అంశాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి పరిశీలించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డి శేరిలింగంపల్లి జోన్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియను పరిశీలించారు. విచారణ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# బొప్పాపూర్‌లో ఒంటరి దళిత వృద్ధుడి దయనీయ మృతి

## నా అన్నవారు లేని వృద్ధుడి అంత్యక్రియలకు విరాళాల సేకరణ



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 2: అనారోగ్యంతో మంచానికే పరిమితమైన ఓ ఒంటరి దళిత వృద్ధుడు మృత్యువాత పడగా, అతని మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కూడా ఎవరూ లేకపోవడం బొప్పాపూర్ గ్రామంలో విషాదాన్ని నింపింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి శంకరయ్య తండ్రి రామయ్య (75) అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. శంకరయ్య వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. సుమారు మూడు రోజులుగా మంచానికే పరిమితమయ్యాడు. ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో బుధవారం ఉదయం స్థానికులకు అనుమానం వచ్చి ఇంటి తలుపులు తెరిచి చూడగా శంకరయ్య మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

**నా అన్నవారు లేని ఒంటరి జీవితం..**

శంకరయ్యకు భార్యతో పాటు కుటుంబ సభ్యులు ఎవరూ లేరని స్థానికులు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ ఒంటరిగానే జీవనం సాగించిన ఆయన చివరి రోజులు మరింత దయనీయంగా మారాయి. మృతి చెందిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా కుటుంబ సభ్యులు లేకపోవడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

**అంత్యక్రియలకు మానవతావాదుల సహాయం కోరుతూ..**

శంకరయ్య అంత్యక్రియలు గౌరవప్రదంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, దాతలు, దయామయులు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు. ఒంటరి వృద్ధుడి చివరి ప్రయాణానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఎవరూ లేక అనాథలా మృత్యువాత పడిన శంకరయ్య ఘటన గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది. ఆయన అంత్యక్రియల కోసం స్థానికుల ఆధ్వర్యంలో విరాళాల సేకరణకు చర్యలు చేపట్టారు.

# మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో మూడు గ్రామాల్లో తీరిన తాగునీటి సమస్య



ధర్మవరం, సెప్టెంబర్ 02 (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం మండలంలోని ఓబుళనాయునిపల్లి, కుణుతూరు, చిగిచెర్ల గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యపై మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తక్షణమే స్పందించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబును అధికారులతో సమన్వయం చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో అధికారులు ఆయా గ్రామాల్లో నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. ఓబుళనాయునిపల్లిలో గ్రామ పంచాయతీ నిధులతో సుమారు రూ.35 వేల వ్యయంతో కొత్త మోటార్ ఏర్పాటు చేశారు. కుణుతూరులో పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. అనంతరం మూడు గ్రామాల్లో తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. నీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామాల ప్రజలు ఉపశమనం వ్యక్తం చేశారు. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఆర్వో మురళీధర్, డీఈ శాంతన్న, ఏఈ వెంకటేష్, పంచాయతీ అధికారులు, సిబ్బంది, వాటర్ లైన్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ జి ఎఫ్ ఇబ్రహీంపట్నం మండల లెవెల్ టోర్నమెంట్, సెలక్షన్స్: ఫిజికల్ డైరెక్టర్ సుశీల

అరుణప్రభ 2 ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం గురుకుల విద్యాపీట్ లో ఈ నెల 8 9 10 తేదీలలో ఇబ్రహీంపట్నం మండల లెవెల్ టోర్నమెంట్, సెలక్షన్స్ నిర్వహించ బడుతున్నాయి. ఈ క్రీడా పోటీల్లో అండర్ 14 బాలికలు, బాలురు, అండర్ 17 బాలికలు, బాలురు పాల్గొననున్నారు.. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ ఇబ్రహీంపట్నం ఇంచార్జ్ సుశీల మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు సోషల్ వెల్ఫేర్, కస్తూర్బా గాంధీ, పాఠశాలలో వున్న క్రీడాకారులు పాల్గొనవలసిందిగా కోరుతూ, 8 వ తేదీన వాలీబాల్ 9 ఖో ఖో 10 కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించ బడుతుంది. ఈ అవకాశాన్ని క్రీడాకారులు అందిపుచ్చుకొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జరగబోయే జోన్ జిల్లా స్థాయిలో రాణించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ విస్లావత్ రాజు, ఆంజనేయులు, రాజశేఖర్ పాల్గొన్నారు.



# ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు

ధర్మవరం, సెప్టెంబర్ 2; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని కొత్తపేట, పీఆర్టీ సర్కిల్, మున్సిపల్ కార్యాలయం, వైఎస్సార్ సర్కిల్‌లలో వైసీపీ నాయకులు వైఎస్సార్ 17వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు కేతిరెడ్డి కార్యాలయం నుంచి పీఆర్టీ సర్కిల్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో పేదల సంక్షేమానికి వైఎస్సార్ విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అన్నారు. అనంతరం 'జోహార్ వైఎస్సార్.. అమర్ రహే వైఎస్సార్' అంటూ నినాదాలు చేశారు. మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, చెందమూరి నారాయణరెడ్డి, బాల్రెడ్డి, మేడాపురం వెంకటేష్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

### నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



నారాయణఖేడ్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మానూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. రైతుల సంక్షేమంతో పాటు గ్రామాల్లో రహదారుల మరమ్మతులు, విద్య, వైద్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికీ సక్రమంగా అందేలా చూడాలని, వ్యవసాయంతో పాటు గృహావసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు గతంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు తమ పరిధిలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. ఆయా శాఖల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడిన సంజీవరెడ్డి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇరువర్గాలు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని అన్నారు. మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు దత్తు, దిగంబరరెడ్డి, సిద్ధారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో రేవంత్ సర్కార్ ఫెయిల్

**ఆరు గ్యారంటీలతో గెలిచి, 420 హామీలకు ఎగనామం!**

**కాంగ్రెస్ సర్కార్ పై మాజీ మంత్రి మల్లన్న ఫైర్**

**బోడుప్పల్లో 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన ర్యాలీ**

**మాజీ మేయర్ జక్కా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ సూపర్ సక్సెస్**



బోడుప్పల్, సెప్టెంబరు 02, అరుణ ప్రభ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం పీర్జాదిగూడలో ఘనంగా జరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు.. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రజలకు మరోసారి గుర్తు చేస్తూ 420 మీటర్ల భారీ ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాల్సిన హామీలు, బాకీగా ఉన్న హామీలను వివరిస్తూ బాకీ కార్డులు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తాగునీరు, విద్యుత్ వంటి కనీస అవసరాల విషయంలో కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పథకాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..420 హామీలను ప్రజల ముందుంచి.. వాటి అమలు పరిస్థితిని ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని రాబోయే ఏడు రోజుల పాటు రోజుకొక నిరసన కార్యక్రమం నిర్వహించి.. ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, కొడే పోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, శ్యామల శ్రీనివాస్, యు బి ఎ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణతో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 420 మోసాలపై ఇబ్రహీంపట్నంలో బిఆర్ఎస్ భారీ ర్యాలీ

**ఇది 1000 రోజుల**

**ప్రభుత్వ పాలన కాదు.. వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజా పీడన!**

**మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి**





అరుణప్రభ 2 ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ గారి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వారం రోజుల పాటు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా, ఈ రోజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు 420 అడుగుల కాంగ్రెస్ 420 హామీల ఫ్లెక్సీతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి గారు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) గారు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని ధర్నా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తా రోకో నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేసిన మోసాలను, ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అరాచకాలను ఎండగట్టారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో పాటు స్థానిక ఎమ్మెల్యే కారణంగా నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను వివరించి, ప్రజా సమస్యలపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. ఈ అంశాలన్నింటినీ ప్రజలకు చేరవేసేలా ప్రసంగించారు. రాబోయే రోజులలో ఈ ప్రభుత్వంపై పోరుబాట కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి కౌన్సిలర్లు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సంగారెడ్డి, సెప్టెంబర్ 2: డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడుల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ సూచించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసులతో పాటు ప్రజల అప్రమత్తత కూడా ఎంతో కీలకమని అన్నారు. సెప్టెంబర్ మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగృత దివస్‌ను పురస్కరించుకుని సదాశివపేట పట్టణంలోని హర్ష బ్యాంకెట్ హాల్‌లో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరయ్యారు. తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సైబర్ జాగృత దివస్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, వన్‌టైమ్ పాస్‌వర్డ్, పిన్, కార్డు భద్రతా సంఖ్య, పాస్‌వర్డ్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. బ్యాంకు అధికారులు, పోలీసుల పేరుతో ఫోన్ చేసే వ్యక్తులను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలు ఇవ్వవద్దన్నారు. డిజిటల్ చెల్లింపులు చేసే సమయంలో నగదు సరైన వ్యక్తి లేదా ఖాతాకే వెళు_ందో నిర్ధారించుకోవాలని సూచించారు. భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. గుర్తుతెలియని వెబ్‌సైట్లు, వ్యక్తులకు ముందస్తుగా నగదు చెల్లించకుండా విశ్వసనీయమైన వేదికలను మాత్రమే వినియోగించాలని సూచించారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆన్‌లైన్ పెట్టుబడులు, ట్రేడింగ్, క్రిప్టో కరెన్సీ, షేర్ మార్కెట్ పేరుతో వచ్చే అనుమానాస్పద ఆఫర్లను నమ్మవద్దని ఎస్పీ హెచ్చరించారు. పెట్టుబడి పెట్టాలని తొందరపెట్టే వ్యక్తులు, సంస్థల వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడంతో పాటు సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

**గణేష్ మండపాల వద్ద అవగాహన**

గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో గణేష్ మండపాల వద్ద సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లను ఏర్పాటు చేసి భక్తులు, ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. శాంతి కమిటీ, సమన్వయ సమావేశాలను కూడా సైబర్ అవగాహన కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ఆర్థిక నష్టానికి దారితీయవచ్చని, ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతపై అవగాహన పెంచుకుని ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో డీసీసీ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, సదాశివపేట ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి, సైబర్ సెల్ సిబ్బంది, సదాశివపేటకు చెందిన సుమారు 350 మంది వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై సమగ్ర సమీక్ష

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ చంద్రా రెడ్డి షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో షాద్‌నగర్ డివిజన్‌కు సంబంధించిన వివిధ రెవెన్యూ అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ రెవెన్యూ అంశాలు, సర్వే సంబంధిత పనుల పురోగతి తదితర అంశాలను సమీక్షించారు. పెండింగ్ పనులను ప్రాధాన్యతతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సత్వరంగా అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో షాద్‌నగర్ ఆర్డీఓతో పాటు సంబంధిత డివిజనల్ తహసీల్దార్లు, ADSLR, DCSO, DMCS, మండల సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట టిమ్స్ కు కొండా లక్ష్మణ్ పేరు నిర్ణయం అభినందనీయం

### టస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న



కొత్తపేట టిమ్స్ హాస్పిటల్ కు స్వాతంత్ర్య సమర యోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టడం అభినందనీయం అని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్ కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు ఖరారు చేసిన నేపథ్యంలో పిండిగ స్పందించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాజీలేని ఉద్యమ నాయకులు బహుజన బంధు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు ఖరారు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వెంకన్న ధన్యవాదాలు తెలిపారు. ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం రంగారెడ్డి జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే హాస్పిటల్ కు లక్ష్మణ్ బాపూజీ పేరు అత్యంత కీలకం అని ఆయన అభిప్రాయపడ్డారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో కూడా పదవులు సైతం లెక్క చేయలేదని ఆయన అన్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు ఖరారు తో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలు హర్షం వ్యక్తం పరుస్తున్నారు అని వెంకన్న పేర్కొన్నారు.



# పేదల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్

### ప్రజా సంక్షేమమే ఆయనకు నిజమైన నివాళి: ఎమ్మెల్యే బాలు నాయక్

అరుణ ప్రభ, దేవరకొండ డివిజన్, సెప్టెంబర్ 2 ,దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా దేవరకొండ పట్టణంలో తన నివాసంలో బుధవారం వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైయస్సార్ పేరు చెబితే పేద ప్రజల సంక్షేమం ,రైతుల అభివృద్ధి, ఆరోగ్యం ,విద్య ,సామాజిక న్యాయం గుర్తుకొస్తాయని ఆయన అన్నారు .పేదల జీవితాల్లో వెలుగులు నింపే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసే ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న మహా నాయకుడని ఎమ్మెల్యే అన్నారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సమావేశంలో దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన 242 మంది లబ్ధిదారులకు ఒక కోటి 12 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. వైయస్సార్ ఆశయాలతో రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు .దేవరకొండ నియోజకవర్గం లో విద్యా, వైద్య ,రహదారులు, సాగునీరు ,తాగునీరు, సంక్షేమం రంగాల్లో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శైలజ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు మారుపాక సురేష్ గౌడ్, చింతపల్లి మండల అధ్యక్షుడు హరి నాయక్, చందంపేట మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, కొండేమల్లె పెల్లి మండలాధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ఎరుకల వెంకటయ్య గౌడ్, ఉ టుకూరు వేమన రెడ్డి, మేకల రాజేందర్ రెడ్డి, కిన్నెర హరికృష్ణ ,పట్టణ కౌన్సిలర్లు ,వివిధ గ్రామాల సర్పంచులు ,మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ,లబ్ధిదారులు పాల్గొన్నారు.



# విదేశీ విద్యా పర్యటనకు ఉపాధ్యాయుల ఎంపికకు ఇంటర్వ్యూల నిర్వహణ

అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్ 2, 2026 : విదేశీ విద్యా పర్యటన (ఫారిన్ ఎక్సపోషర్ టూర్ )కు ఉపాధ్యాయులను ఎంపిక చేసేందుకు ఈ రోజు మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని డి ఇ ఓ ఛాంబర్‌లో ఇంటర్వ్యూలను నిర్వహించారు. పురుషోత్తం, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఆధ్వర్యంలో ఏ సత్యనారాయణ మూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి , మహబూబాబాద్ మరియు శిరీష, జిల్లా సంక్షేమ అధికారి (డి డబ్ల్యూ ఓ ) సభ్యులుగా ఉన్న కమిటీ ఈ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఈ ఎంపిక ప్రక్రియలో మొత్తం 14 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విదేశీ విద్యా పర్యటనకు సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాలు మరియు అర్హతల ప్రకారం కమిటీ సభ్యులు ఉపాధ్యాయులతో ఇంటర్వ్యూలు నిర్వహించి వారి అర్హతలను పరిశీలించారు అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న ఉత్తమ విద్యా విధానాలు, వినూత్న బోధనా పద్ధతులు మరియు విద్యారంగంలో జరుగుతున్న నూతన పరిణామాలను అధ్యయనం చేసే అవకాశం ఈ విదేశీ విద్యా పర్యటన ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు లభించనుంది. వారు పొందిన అనుభవాలు జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు దోహదపడనున్నాయి. ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించారని జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబాబాద్ తెలిపారు

# జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళి మోహన్




అరుణప్రభ 2 సెప్టెంబర్ మహబూబాబాద్ ఈ నెల 12వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లాలో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె మురళి మోహన్ పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు కార్యదర్శి ఆధ్వర్యంలో న్యాయ వాదులతో కోర్టు ప్రాంగణంలో సన్నాహక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ కేసులకు సంబంధించి ఫిర్యాదుదారుల తరఫు న్యాయవాదులు, బీమా (ఇన్సూరెన్స్) సంస్థల న్యాయవాదులను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె మురళి మోహన్ మాట్లాడుతూ.. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మోటారు వాహన ప్రమాద నష్టపరిహార కేసులను రాజీమార్గం ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. బాధితులకు తగిన న్యాయమైన నష్టపరిహారం సత్వరమే అందేలా ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, వారి న్యాయవాదులు స్పందించి లోక్ అదాలత్ కు సహకరించాలన్నారు. జాతీయ లోక్ అదాలత్ నాటికి ఎక్కువ సంఖ్యలో క్లెయిమ్‌లు పరిష్కారమయ్యేలా ముందస్తుగానే ప్రీ లోక్ అదాలత్ లు ఈ నెల 7 మరియు 8 వ తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున రాజీకి సిద్ధమైన కేసుల వివరాలను న్యాయవాదులు ఐదవ తేదీ లోపు న్యాయ సేవా సంస్థలో అందించాలని కోరారు. ఈ ప్రీ లోక్ అదాలత్ ద్వారా పిటిషనర్లు, ఇన్సూరెన్స్ కంపెనీల మధ్య సంప్రదింపులు జరిపి సత్వర పరిష్కారం దిశగా కృషి చేయడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఇచ్చే తీర్పులపై అప్పీలు ఉండదని, కోర్టు ఫీజు కూడా రీఫండ్ అవుతుందని, ఇరువర్గాలకు ఇది ఎంతో ప్రయోజనకరమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం లో మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి స్వాతి మురారి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సత్యనారాయణ, మరియు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**చదువుపై పూర్తి దృష్టి సారించాలి: జిల్లా ఎస్పీ డా. శబరీష్**

**వినాయకుడు మనకు నేర్పే పాఠాలు, సైబర్ విజ్ఞానం కలిగి ఉండండి**

**పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డా. శబరీష్**



అరుణప్రభ 2 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం ప్రభుత్వ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, మొబైల్ వినియోగం, వ్యక్తిగత భద్రత మరియు విద్యార్థుల భవిష్యత్తుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులతో నేరుగా మాట్లాడి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల సంఖ్యతో పాటు వాటి రూపాలు కూడా మారుతున్నాయని, విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, అపరిచిత వ్యక్తులతో చాటింగ్ మరియు ఇతర ఆన్‌లైన్ కార్యకలాపాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, వీడియోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ లు వంటి సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు, యాప్‌లు మరియు ఆన్‌లైన్ ఆఫర్లకు దూరంగా ఉండాలని తెలిపారు. మొబైల్ ఫోన్‌ను అవసరానికి మించి ఉపయోగించడం వల్ల విద్యార్థుల చదువు, ఏకాగ్రత మరియు భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. మొబైల్‌ను జ్ఞానాన్ని పెంచుకునేందుకు ఉపయోగించుకోవాలని, సమయాన్ని వృథా చేసే సోషల్ మీడియా, రీల్స్, అనవసరమైన గేమ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చదువుపై ఎలా దృష్టి పెట్టాలి, సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి, లక్ష్యాన్ని ఎలా నిర్దేశించుకోవాలి అనే అంశాలపై ఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ ఒక నిర్దిష్ట ప్రణాళికతో చదువుకోవాలని, అర్థం కాని విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, ఇతరులతో తమను తాము పోల్చుకోకుండా తమ లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని తెలిపారు. "వైఫల్యం విజయానికి ముగింపు కాదు.. విజయానికి వేసే తొలి అడుగు. ఒకసారి విఫలమయ్యామని నిరాశ చెందకుండా, ఆ వైఫల్యం నుంచి పాఠం నేర్చుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలి" అని విద్యార్థులకు సూచించారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడి మౌనంగా ఉండవద్దని, "చీకటిలో దాక్కోకండి.. మీ గొంతును వినిపించండి. మీకు ఎదురయ్యే సమస్యను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురండి" అని ఎస్పీ తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, సోషల్ మీడియాలో ఇబ్బందులు కలిగించినా, సైబర్ మోసానికి గురైనా వెంటనే నమ్మకమైన పెద్దలకు తెలియజేసి పోలీసులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను గుర్తించి, మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం రాబోయే గణేష్ ఉత్సవాల సందర్భంగా సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన "బి సైబర్ వైస్ -- లార్డ్ గణేశా టీచస్ అస్ " అవగాహన పోస్టర్లను జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆవిష్కరించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా విరాళాల పేరుతో వచ్చే నకిలీ క్యూ ఆర్ కోడ్‌లు, ఫేక్ సోషల్ మీడియా ఖాతాలు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఆన్‌లైన్ ఆఫర్లు తదితర వాటి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఓటీపీ లు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఎటిఎం /డెబిట్ కార్డు వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సూచించారు. సమయానికి ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థినులతో నేరుగా ఇంటరాక్ట్ అవుతూ వారి సందేహాలను తెలుసుకుని, సైబర్ నేరాలు, మొబైల్ వినియోగం, చదువు, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సైబర్ సెల్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలన అసమర్ధ ప్రభుత్వం

**కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన**
**వైఫల్యాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో భారీ ధర్నా**

**గాడిద లతో నిరసన.. 420 ఫీట్ల బ్యానర్ ప్రదర్శన**

**ప్రజా సమస్యలపై పోరాటం..**
**ప్రజల పక్షాన బీఆర్ఎస్ : ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**




సెప్టెంబర్ 02, అరుణ ప్రభ : ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్ ౨ రోడ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాలు, అమలు కాని హామీలు, ప్రజలను మోసం చేసిన తీరును నిరసిస్తూ బుధవారం భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఎమ్మెల్యే విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలపై నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్యక్రమంలో భాగంగా బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మల్కాజ్ గిరి ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షుడు లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహిళ సోదరీమణులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ చూపిన అహింస శాంతి సిద్ధాంతాలు ప్రపంచ దేశాలకే ఆదర్శనీయం



అరుణప్రభ 2 సెప్టెంబర్ మహబూబాబాద్ : గాంధీ చూపిన అహింసా శాంతి మార్గాలు ప్రపంచ దేశాలకే మార్గదర్శనమని, ప్రస్తుత యాంత్రిక పరిస్థితుల్లో మళ్ళీ గాంధీ ఇజం అవసరం ఎంతైనా ఉందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే. అనిల్ కుమార్ అన్నారు. బుధవారం నాడు జిల్లా కలెక్టరేట్లో,గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్-2 నుండి అక్టోబర్ -2 వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల్లో గాంధీజీ సిద్ధాంతాలు, ఆలోచనలను వాళ్ల మనసులోకి ఎక్కేలా ప్రచారం చేసే గాంధీజీ మాసోత్సవాల కార్యక్రమాల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నాటి భారత దేశ స్వాతంత్ర సంగ్రామం, మొదలు నిన్న మొన్నటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ప్రజలు అహింసాయుత శాంతి మార్గాల్లోనే విజయం సాధించారనేది నిత్య సత్యమని, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అనేక ప్రజా పోరాటాలు శాంతి ఉద్యమాలకు మహాత్ముడే ఆదర్శం అని పేర్కొన్నారు.ప్రముఖ సైకాలజిస్ట్ గాంధీజీ రీసర్చ్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో నిత్యం హింస ప్రవృత్తి, హత్యలు, ఆత్మహత్యలు, మానభంగాలు అనేకం చోటుచేసుకుంటున్నాయని, ఉన్నత సాంస్కృతిక ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన భారతదేశం ఆత్మహత్యలు, నిరక్షరాస్యత, అవినీతిలో ముందంజలో ఉండటం బాధాకరమని, ఇటువంటి పరిస్థితులకు పరిష్కార మార్గాలుగా మనం మళ్ళీ మూలాల్లోకి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ క్రమంలో భారతదేశం ఒక సంపూర్ణమైన ఎదుగుదలతో కూడిన, వికాసంతో పరిణితి చెందిన మనస్తత్వం గల యువతి యువకులుగా ఎదగడానికి, కౌమార దశలో సరైన మార్గ నిర్దేశం చేస్తూ విద్యార్థులను జాగృతం చేయాల్సిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఆక్రమంలోనే గత 20 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం గాంధీజీ మాసోత్సవాలు నిర్వహిస్తూ విద్యార్థులను ఒక మంచి ఆలోచనల దిశగా పయనించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ముందుగా గాంధీజీ ఆలోచనలు సిద్ధాంతాలను ప్రచారం చేసే కార్యక్రమాలను నిర్వహించి, ప్రతి జిల్లాలో ప్రపంచ శాంతి గాంధీ మార్గం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు అక్టోబర్ రెండవ తారీకు నాడు గాంధీ జయంతి రోజున బహుమతులు ప్రశంస పత్రాలు ఆయా జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ మరియు సమాజంలోని మేధావులు, సామాజికవేత్తలు సహకరించి దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేంద్రప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు చిత్తనూరీ శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ శాఖ
## అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష సమావేశం

అరుణప్రభ 2 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం లో జిల్లా లోని అన్ని మండల వ్యవసాయ అధికారులకు మరియు డివిజన్ ఏడిఏ లకు రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుండి అడిషనల్ డైరెక్టర్లు విజయకుమార్ , బాలు మరియు రాష్ట్ర స్థాయి వ్యవసాయ అధికారులు వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాల పై సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వానాకాలం లో జిల్లా లో సాగు చేసిన ఏడు సన్నరకాల రైతుల వివరాలు టీ సీడ్ పోర్టల్ ఎంట్రీ చేయడం పై, క్రాప్ బుకింగ్ వివరాలు,ఆత్మ(అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) పథకం ద్వారా నిర్వహిస్తున్న రైతు శిక్షణ కార్యక్రమాలు,ప్రదర్శన వివరాలు, ప్రకృతి వ్యవసాయం శిక్షణ కార్యక్రమలు, ఎరువుల పంపిణీ పై కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఎఫ్ ఎఫ్ ఎస్ విధానం అమలు, రైతు నేస్తం పథకం ద్వారా నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ కార్యక్రమాల పై సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ విజయచంద్ర, మరిపెడ ఏడిఏ మురళి, మహబూబాబాద్ ఏడిఏ శ్రీనివాసరావు,అన్ని మండలాల వ్యవసాయ అధికారులు, టెక్నికల్ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



## మానవత్వాన్ని రక్షించడానికి అవతరించినవాడే శ్రీ కృష్ణుడు
## గౌతమి అకాడమీలో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

అరుణప్రభ 2 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారంగా కృష్ణ రూపంలో భూమిపై అవతరించిన పవిత్ర దినముని శ్రీ కృష్ణాష్టమిగా దేశ ప్రజలందరూ జరుపుకుంటారని గౌతమి కళాశాల డైరెక్టర్ తక్కళ్లపల్లి సంధ్యారాణి అన్నారు కృష్ణాష్టమి పురస్కరించుకొని తన నివాసంలో ముందస్తుగా వేడుకలను సర్వాంగ సుందరంగా ప్రత్యేక పుష్పాలంకరణలో ఏర్పాటుచేసిన శ్రీకృష్ణుని పాదముద్రలకు భక్తిశ్రద్ధలతో ఆమె పూజించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అన్యాయం పెరిగినప్పుడు మానవత్వాన్ని రక్షించడానికి వెలసిన వాడే శ్రీ కృష్ణుడు అని ఆమె అన్నారు శ్రీకృష్ణుని జన్మ జీవితాంతం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని తెలిపారు వేడుకల్లో గౌతమి కళాశాల మార్గదర్శి బి ఇ డి కళాశాల ప్రిన్సిపాల్ ఉమ్మగాని అరుణ్ కుమార్ అధ్యాపకులు శేఖర్ రవి రమేష్ సంపత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు



## పూరి గుడిసె దగ్ధం..
## బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 2 (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ గ్రామానికి చెందిన నిరుపేద మల్లారపు పోచయ్యకు చెందిన పూరిగుడిసె బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో గుడిసెలోని సామగ్రి మొత్తం కాలిపోయి బాధిత కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ నాగిల్లి వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ కొర్రి అనిల్ వెంటనే స్పందించి రెవెన్యూ అధికారులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు సమాచారం అందించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. పూరిగుడిసె దగ్ధం కావడంతో నిరాశ్రయులైన కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం, దాతలు ముందుకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రాంరెడ్డి, గంట బుచ్చగౌడ్, ఉచిడి పవన్ రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## పార్థివ దేహానికి నివాళులర్పించిన
## నోపా జిల్లా కన్వీనర్ తక్కెళ్లపల్లి. శ్రీనివాస్



అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్ 2 : మహబూబాబాద్ మున్సిపల్ పరిధి 1 వ వార్డు ఈదుల పూసపల్లి గ్రామానికి చెందిన నాయి బ్రాహ్మణ సంఘం కుల పెద్ద జంపాల రామదాస్ మృతి చెందారు. వారి స్వగృహంలో పార్థివదేహాన్ని నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, బాధ్యులు సందర్శించి నివాళు లర్పించారు. రామదాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ గజవెల్లి వెంకన్న, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ కార్పొరేటర్ కొమరగిరి సుమన్, నంద్యాల నరసింహారావు, ఖమ్మం శ్రీనివాస్, నిడిగొండ సత్యం, ఉల్లెందుల కనకయ్య, కుమ్మరికుంట నాగన్న, జంపాల దర్గేష్, జంపాల. గోపి, తక్కెళ్లపల్లి .మురళి, ఉబ్బలపల్లి .అంజయ్య, హరీష్, జంపాల. ఉపేందర్, జంపాల. శ్రీను, తోట. కృష్ణ శ్రీనివాస్, తక్కెళ్లపల్లి. శ్రీనివాస్, ఎలమందల.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ సమస్యకు పరిష్కారం లభించింది: కానుగంటి వెంకట్‌రెడ్డి

## మహాదేవపురం కాలనీ సర్వే నంబర్లను 22ఏ జాబితా నుంచి తొలగిస్తూ కలెక్టర్ సంతకం



కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 2 (అరుణ ప్రభ) మహాదేవపురం కాలనీవాసులు గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న 22ఏ సమస్యకు పరిష్కారం లభించిందని కాలనీ అధ్యక్షుడు కానుగంటి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం జరిగిన కలెక్టర్ సమావేశంలో మహాదేవపురం కాలనీకి సంబంధించిన సర్వే నంబర్లపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. కాలనీకి సంబంధించిన సర్వే నంబర్లు 329/2 నుంచి 329/10 వరకు, 308/1లను 22ఏ జాబితా నుంచి తొలగించే ఫైల్‌పై కలెక్టర్ సంతకం చేసినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు. తొలగింపు ప్రక్రియను తక్షణమే అమలు చేయాలని సంబంధిత కిందిస్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు పేర్కొన్నారు.

**కాలనీ సమస్యపై ప్రత్యేక దృష్టి**

22ఏ సమస్య కారణంగా గత కొంతకాలంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో కలెక్టర్ సమావేశానికి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ కోలన్ హనుమంత రెడ్డితో పాటు మహాదేవపురం కాలనీ సభ్యులు కూడా హాజరయ్యారని చెప్పారు.

**కోలన్ హనుమంత రెడ్డికి కృతజ్ఞతలు**

మహాదేవపురం కాలనీ 22ఏ సమస్య పరిష్కారం కోసం మొదటి నుంచి కోలన్ హనుమంత రెడ్డి అందించిన సహాయ సహకారాలు మరువలేనివని కానుగంటి వెంకట్‌రెడ్డి అన్నారు. సమస్య పరిష్కారం కోసం తమకు అండగా నిలిచి, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంలో సహకరించిన కోలన్ హనుమంత రెడ్డికి మహాదేవపురం కాలనీ ప్రజల తరఫున, తన తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 22ఏ సమస్య పరిష్కారంతో కాలనీవాసుల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరపడిందని, ఇకపై సంబంధిత అధికారుల ద్వారా తదుపరి ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని కాలనీ అధ్యక్షుడు కానుగంటి వెంకట్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# అభివృద్ధికి కేరాఫ్ అడ్రెస్‌గా కాంగ్రెస్: ఎంపీ బలరాం నాయక్

అరుణప్రభ 2 సెప్టెంబర్ మహబూబాబాద్ : అభివృద్ధికి కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అని, రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక పేదలకు అనేక సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మానుకోట ఎంపీ బలరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 1000 రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అవి అర్హులకు అందించినట్లు తెలిపారు. దళిత, గిరిజన, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడ్డట్లు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను కడుతూనే, మరో పక్క ఎన్నికల హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు.ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక గత బీఆర్ఎస్ 10 ఏళ్ల కాలంలో చేయలేని అభివృద్ధిని 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో చేసి చూపించామని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. 1000 రోజుల పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదని చెప్పారు.

రూ. 60 కోట్లతో మానుకోట మునిసిపాలిటీలో అభివృద్ధి కొనసాగుతుందని, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు అనేక పనులు జరుగుతున్నాయని తెలిపారు.రూ. 7 కోట్లతో బంధం చెరువు మినీ ట్యాంక్ బండ్‌గా, రూ. 2 కోట్లతో మున్నేరు వాగు వద్ద బతుకమ్మ, వినాయక నిమజ్జన ఘాట్, రూ. 9 కోట్లతో దాశరథి స్మృతి వనం నిర్మించనున్నట్లు తెలిపారు.త్వరలో 400 ఎకరాల్లో రూ. 1000 కోట్లతో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభం కానుందని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.రూ. 350 కోట్లతో జిల్లా కేంద్రానికి ఓఆర్ఆర్ రాబోతుందని స్పష్టం చేశారు.కేసముద్రంలో రూ. 500 పండగల తోట అభివృద్ధి జరుగుతుందన్నారు.

కేసముద్రం అభివృద్ధి పై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ..

గత ప్రభుత్వంలో అభివృద్ధిని మరుగున పడేసిన నాయకులు, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమాన్ని, మౌలిక వసతుల కల్పనను చూసి ఓర్వలేక లేనిపోని అబండాలు వేస్తున్నారని కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ తీవ్రంగా మండిపడ్డారు. పాలించడం చేతకాక, అభివృద్ధి చేస్తున్న వారిని వేలెత్తి చూపడం గత పాలకుల అహంకారానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. కేసముద్రం మండలంలో సుమారు రూ. 750 కోట్ల భారీ నిధులతో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు ఉరకలు వేస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే గడీల రాజ్యం కాదని, ఇది పూర్తిగా 'ప్రజల రాజ్యం' అని స్పష్టం చేశారు. నరేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే కేసముద్రం నియోజకవర్గానికి



పెద్ద ఎత్తున నిధులు సమకూరాయని సమ్మయ్య గౌడ్ కొనియాడారు. "కేసముద్రం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తాగునీరు, డ్రైనేజీలు, రహదారులు, విద్య, సాగునీటి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయి. మండలంలోని ప్రతి గ్రామానికి ఈ అభివృద్ధి ఫలాలు సమానంగా అందుతున్నాయి" అని తెలిపారు. నిధుల సాధనలో, సమస్యల పరిష్కారంలో నిరంతరం శ్రమిస్తున్న 'వేం అన్న'కు కేసముద్రం ప్రజలు రుణపడి ఉంటారన్నారు.కేవలం మాటలకే పరిమితం కాకుండా పనుల నాణ్యత, సమయపాలనపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. "రాజకీయ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం కాదు... ఏమైనా సూచనలు, లోపాలు ఉంటే చెబితే సరిదిద్దుతాం. కేవలం విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. మాటలతో కాదు, క్షేత్రస్థాయిలో జరిగే అభివృద్ధి పనులతోనే మేము సమాధానం చెబుతాం" అని స్పష్టం చేశారు.అధికారాన్ని ప్రజా సంక్షేమానికి వినియోగించడమే కాంగ్రెస్ లక్ష్యమని, మండలంలో పెండింగ్‌లో ఉన్న మిగతా పనులను కూడా త్వరలోనే పూర్తి చేసి కేసముద్రంను మోడల్ మండలంగా తీర్చిదిద్దుతామని సమ్మయ్య గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కేసముద్రం మండల ప్రజలు వేం నరేందర్ రెడ్డి కి ఎంపీ బలరాం నాయక్ ఎమ్మెల్యే మురళి నాయక్ రుణపడి ఉంటారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు ఝాన్సీ ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, అర్బన్ అధ్యక్షుడు మనపురపు అంజయ్య, మండల అధ్యక్షుడు తెల్లంకొండ శ్రీనివాస్, పలువురు సుబ్బయ్య, అశోక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలి

## గణేష్ ఉత్సవాల నిర్వహణకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలి: జిల్లా ఎస్పీ డా. శబరీష్



అరుణప్రభ 2 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పోలీసింగ్‌లో డిజిటల్ వ్యవస్థల సమర్థ వినియోగంపై ఇచ్చిన ఆదేశాల అమలుపై ఈ సమావేశంలో ప్రధానంగా సమీక్షించారు ఈ సమావేశంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్లు, డీసీఆర్‌బీ, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్లలో సీసీటీఎన్ ఎస్ ,ఇ -సాక్ష్య ఇ -సమ్మోన్స్ తదితర సాంకేతిక వ్యవస్థల వినియోగం, కేసులకు సంబంధించిన వివరాల అప్‌డేటింగ్, పెండింగ్ ప్రక్రియలు, సాంకేతిక సమస్యల పరిష్కారం తదితర అంశాలను ఎస్పీ సమీక్షించారు సీసీటీఎన్ ఎస్ లో ఎఫ్ ఐ ఆర్ నమోదు నుంచి దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రతి దశకు సంబంధించిన వివరాలను సకాలంలో, కచ్చితంగా అప్‌డేట్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. పెండింగ్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు గుర్తించి పూర్తి చేయాలని, సాంకేతిక సమస్యలు ఎదురైతే ఐటీ సెల్, డి సి ఆర్ బి సహకారంతో వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఇ -సాక్ష్య లో కేసులకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు, సాక్ష్యాలు, రిపోర్టులను సకాలంలో నమోదు చేయాలని, ఇ సమ్మన్స్ జారీ, సర్వీస్ మరియు సంబంధిత అప్‌డేట్లను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ స్థాయిలో సాంకేతిక వ్యవస్థలను కేవలం నమోదు కోసం కాకుండా దర్యాప్తు ప్రక్రియను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మరియు వేగవంతంగా చేయడానికి వినియోగించాలని సూచించారు. అన్ని పెండింగ్ కేసులను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని, కేసులు ఆలస్యం కావడానికి గల కారణాలను అధికారులు గుర్తించాలని ఎస్పీ ఆదేశించారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో చార్జ్‌షీట్‌లు, ఫైనల్ రిపోర్టులను సకాలంలో దాఖలు చేయాలని సూచించారు. రిపీటెడ్ ఆఫెండర్లను గుర్తించి అవసరమైన చోట రౌడీ షీట్లు తెరవడం, ఆర్గనైజ్డ్ క్రైమ్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేయడం వంటి ప్రక్రియలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని



ఆదేశించారు

పోక్సో కేసుల్లో నిర్ణీత సమయంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని, ఎన్ డి పి ఎస్ కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను త్వరితగతిన అదుపులోకి తీసుకోవాలని సూచించారు. మిస్సింగ్ కేసులను ప్రత్యేకంగా సమీక్షించి, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు ప్రతి పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ ఐ ఆర్ లను ప్రతిరోజూ పరిశీలించి, వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం నమోదు చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే కంప్లెయిన్స్ రిపోర్ట్స్ ను నిర్ణీత సమయంలో పూర్తి చేసి సమర్పించాలని, ఉన్నతాధికారుల ఆదేశాలపై తీసుకున్న చర్యలను సకాలంలో అప్‌డేట్ చేయాలని సూచించారు. లోక్ అదాలత్ కేసులు, ఇ -పెట్టీ కేసెస్ , డ్రంక్ డ్రైవ్ , ఇ చలాన్ కేసుల వివరాలను కూడా సకాలంలో అప్‌డేట్ చేసి పెండెన్సీ లేకుండా చర్యలు పూర్తి చేయాలని ఆదేశించారు. డైల్ -112 ద్వారా వచ్చే అత్యవసర కాల్స్‌కు సత్వరమే స్పందించి, నిర్ణీత సమయంలో సంఘటనా స్థలానికి చేరుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి 112 కాల్‌పై స్పందన సమయాన్ని పర్యవేక్షిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగవంతమైన పోలీస్ సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు

అనంతరం రానున్న గణేష్ ఉత్సవాల నిర్వహణపై ఎస్పీ అధికారులతో సమీక్షించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలను నిర్వాహకులకు ముందుగానే తెలియజేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి, విగ్రహాల ప్రతిష్ఠాపన, ఊరేగింపు, నిమజ్జనం తదితర అంశాలపై ముందస్తుగా సమన్వయం చేయాలని సూచించారు గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన జరిగే ప్రదేశాలను ముందుగానే గుర్తించి జియో టాగింగ్ చేయాలని, ప్రతి విగ్రహానికి సంబంధించిన వివరాలను నమోదు చేసి పోలీస్ రికార్డుల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత, శబ్ద కాలుష్య నిబంధనలు, ఊరేగింపు మరియు నిమజ్జన మార్గాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీలు, ప్రజలు మరియు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు, ప్రతి ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయడం, ప్రజలకు వేగవంతమైన పోలీస్ సేవలు అందించడం, రానున్న గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడం జిల్లా పోలీసుల ప్రధాన ప్రాధాన్యతలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ స్పష్టం చేశారు.



## రాజన్నపేట ఎంపీ యూపీఎస్‌లో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ

అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 02: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలోని ఎంపీ యూపీఎస్ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీమతి మంజుల, గ్రామ సర్పంచ్ కల్లూరి బాపురెడ్డి, ఉప సర్పంచ్ ఉడుగుల యాదగిరి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ శంకర్, మహిళా సంఘాల సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ప్రవీణ్‌రావు, విజయలక్ష్మి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని వారు తెలిపారు.



## అక్రమ ఇసుక, మట్టి రవాణాపై రెవెన్యూ అధికారుల కొరడా

### ::: 7 ట్రాక్టర్లు, ఒక టిప్పర్ అదుపులోకి



ధర్మవరం, సెప్టెంబర్ 2; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం మండల పరిధిలో అనుమతులు లేకుండా ఇసుక, మట్టి రవాణా చేస్తున్న వాహనాలపై రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 7 ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తవ్వకాలు లేదా రవాణాకు పాల్పడితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెనాల్టీలు విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం తహసీల్దార్ తెలిపారు. మండలంలో అక్రమ ఇసుక, మట్టి రవాణాను అరికట్టేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని తహసీల్దార్ స్పష్టం చేశారు.

## ప్రభుత్వ అధికారుల విధులను అడ్డగిస్తే తగిన చర్యలు తప్పవు

### అధికారుల విధులకు ఆటంకం.. ఇద్దరిపై కేసు నమోదు

సెప్టెంబర్ 02, అరుణ ప్రభ. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం తొలగించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకుని, దుర్భాషలాడుతూ జేసీబీ డ్రైవర్‌ను బెదిరించిన ఘటనపై మేడిపల్లి పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 31 న మేడిపల్లి తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఎస్.చంద్రకళ తన సిబ్బందితో బోడుప్పల్ లోని గౌతమ్ నగర్ కాలనీ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేస్తున్నారనే సమాచారం రావడంతో అక్కడికి వెళ్ళి నిర్మాణాన్ని జెసిబీతో కూల్చివేస్తుండగా నర్సింగోజు నరసింహ,విజయ అధికారుల విధులకు ఆటంకం కలిగించి,జేసీబీ డ్రైవర్, సిబ్బందిని బెదిరించినట్లు ఫిర్యాదు అందింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

## నాగలూరుకు స్మశాన వాటిక కేటాయించాలని వినతి

### తహసిల్దార్ దేవరాజుకు గ్రామస్తుల వినతిపత్రం

ధర్మవరం, సెప్టెంబర్ 2; (అరుణ ప్రభ న్యూస్): మండల పరిధిలోని మల్కాపురం పంచాయతీ నాగలూరు గ్రామంలో స్మశాన వాటిక లేక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం తహసిల్దార్ దేవరాజుకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా స్మశాన వాటిక లేకపోవడంతో మృతదేహాల అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 562-3లో ఉన్న ప్రభుత్వ భూమిని స్మశాన వాటిక కోసం కేటాయించాలని వారు తహసిల్దార్‌ను కోరారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి గ్రామ ప్రజలకు స్మశాన వాటిక సౌకర్యం కల్పించాలని గ్రామ పెద్దలు, ప్రజలు విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల సమస్యపై తహసిల్దార్ దేవరాజు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.



## అక్రమ పార్కింగ్‌పై పోలీసుల నిఘా

### విజిబుల్ పోలీసింగ్‌తో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

ముదిగుబ్బ, సెప్టెంబర్ 2; (అరుణ ప్రభ న్యూస్): మండల కేంద్రంలో ట్రాఫిక్ రద్దీ, అక్రమ పార్కింగ్‌ను నియంత్రించేందుకు పోలీసులు బుధవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రామసుబ్బయ్య ఆధ్వర్యంలో అర్బన్ పోలీస్ స్టేషన్ నుంచి కెనరా బ్యాంక్ వరకు సిబ్బంది కాలినడకన పర్యటించి ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించారు. వాహనదారులు రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా నిర్దేశిత ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు కోరారు. రద్దీ ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను కొనసాగిస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కేతన్న, ఏఎస్ఐలు బాబు నాయక్, ప్రసాద్, జమిందార్ ఇస్మాయిల్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా అనధికార లేఔట్

**అన్నవరం పంచాయతీలో అనధికార లేఔట్.**

**సి.ఆర్.జెడ్.లో. మాస్టర్ ప్లాన్ రోడ్లో లేఔట్**

**కోర్టు కేసులు ఉన్నాయని చెప్పని యాజమాన్యులు**

**మోసపోతున్న కొనుగోలు దార్లు**





భీమునిపట్నం ఆగస్టు 29 అరుణ ప్రభ: భీ మ ు ని వ ట్నం మ ం డ ల ం అన్నవరం పంచాయతీ సర్వే నెంబర్ 98 పి లో 24 ఎకరాలలో సి.ఆర్.జెడ్ జోన్ లో నిబంధనలు, మాస్టర్ ప్లాన్ రోడ్ కలిపి లే ఔట్ వేశారు.1996 గౌతం గోల్ఫ్ లేఔట్ పేరుతో ఈ లేఔట్ ఏర్పడింది. లేఅవుట్ ఏర్పడిన దగ్గర్నుంచి ఇప్పటివరకు ఎటువంటి డెవలప్మెంట్ లేకుండా, ఎయిర్ పోర్ట్ వచ్చినతరువాత, అన్నవరం భీచ్ లో ఉబరై పేరుతో వస్తున్న ఫైవ్ స్టార్ హోటల్ చూపించి లేఔట్ అమ్మకాలు జోరందుకున్నాయి. సి.ఆర్.జడ్ స్థలము మాస్టర్ ప్లాన్ రోడ్ స్థలం ఉంచకుండా లేఔట్ నిర్మించారు. లేఔట్ లో కాలువలు రోడ్ పార్క్ స్థలాలు లేవు. సుమారు 500 మంది వరకు స్థలాలు కొనుగోలు చేశారు. బ్యాంకుల లోన్ లకోసం వెళితే లోన్ ఇచ్చేందుకు నిరాకరించారు. అనుమతి లేకుండా 24 ఎకరాలలో లేఔట్ ఎయిర్ పోర్ట్ ఫైవ్ స్టార్ హోటల్ పేరుతో విక్రయించి కొనుగోలు దారులను మోసం చేస్తున్నారు. కోర్టులో కేసులువున్నా,రెవెన్యూ పరంగా ఇబ్బందులు ఉన్న, కాలువలు, ఎలక్ట్రిసిటీ లేకున్నా, రోడ్లు లేకున్నా విశాఖ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అనుమతి లేని లేఅవుట్ విషయంలో చర్యలు తీసుకోవాలని, సి ఆర్ జెడ్ జోన్ బోర్డులు, లేఅవుట్ అప్రూవల్ బోర్డులు పెట్టాలని, ఈ లేఔట్ పై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

# పవన్ కళ్యాణ్ పిలుపుతో కదిలిన యువశక్తి.. బైక్ ర్యాలీతో హోరెత్తిన దక్షిణం, రక్తదానంతో చాటుకున్న జనసేన సేవా స్ఫూర్తి

**పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.. సేవా కార్యక్రమాలతో మార్మోగిన విశాఖ దక్షిణం**

**పూర్ణ మార్కెట్ నుంచి జిల్లా పరిషత్ జంక్షన్ వరకు భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు**

**సుమారు 900 యూనిట్ల రక్తదానం చేసిన జనసేన పార్టీ శ్రేణులు**

**రక్తదానం, మెడికల్ క్యాంప్, కంటి వైద్య శిబిరాలతో ప్రజాసేవకు అంకితమైన జనసేన శ్రేణులు**

**లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంక్, లైన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్, ఫస్ట్ బ్లడ్ బ్యాంక్, కేజిహెచ్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం**



జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి జన్మదినోత్సవం సందర్భంగా విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేన పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. యువజన విభాగం సతీష్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ గారు పాల్గొన్నారు. పూర్ణా మార్కెట్ నుంచి జగదాంబ మీదుగా ఫంక్షన్ హాల్ వరకు సాగిన బైక్ ర్యాలీలో జనసేన యువత, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని, పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను చాటుకున్నారు. ప్రతి జంక్షన్లో పవన్ కళ్యాణ్ గారి జన్మదిన శుభాకాంక్షల పోస్టర్లు, బ్యానర్లతో నగరం పండుగ వాతావరణాన్ని తలపించింది. అనంతరం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం, ఉచిత మెడికల్ క్యాంప్, కంటి వైద్య శిబిరాలకు జనసేన పార్టీ శ్రేణులు, యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్ తదితర సంస్థల సహకారంతో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ గారి జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సేవా దినోత్సవంగా జరుపుకోవడం జనసేన పార్టీ ప్రత్యేకత అని అన్నారు. రక్తదానం చేసి ప్రాణాలను కాపాడటం, వైద్య సేవలను అందించడం ద్వారా పవన్ కళ్యాణ్ గారి సేవా స్ఫూర్తిని యువత ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ గారి పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా జనసేన శ్రేణులు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయని, విశాఖ నగరంలోనూ ప్రతి వార్డు, ప్రతి ప్రాంతంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. "జనసేన అంటే జనంలో ఉండే పార్టీ.. ప్రజల కోసం పనిచేసే పార్టీ. పవన్ కళ్యాణ్ గారి సేవా స్ఫూర్తిని ప్రతి కార్యకర్త ఆచరణలో చూపించాలి" అని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ములుగు జిల్లా పాలంపేటలోని 'గొల్లల గుడి'కి జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు

**భారత పురావస్తు అధ్యయన విభాగం (ఏఎస్ఐ)**





తెలంగాణలోని ములుగు జిల్లా, పాలంపేటలో గల 'గొల్లల గుడి'ని జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన జారీచేసింది. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ పరిధిలోని భారత పురావస్తు అధ్యయన విభాగం (ఏఎస్ఐ) జారీ చేసిన 31.08.2026 నాటి ప్రకటన నం.ఎస్.ఒ.4802(ఇ) 'గెజిట్ ఆఫ్ ఇండియా' (ప్రత్యేక సంచిక) పార్ట్- IIలోని సెక్షన్ 3 ఉప సెక్షన్ (ii) కింద ప్రచురితమైంది. "ప్రాచీన కట్టడాలు-పురావస్తు ప్రదేశాలు-అవశేషాల చట్టం-1958" (1958నాటి 24వ చట్టం)లోని సెక్షన్ 4, ఉప-సెక్షన్ (3) కింద సంక్రమించిన అధికారాల మేరకు 'ఏఎస్ఐ' ఈ ప్రకటన జారీ చేసింది. ములుగు జిల్లా పాలంపేట గ్రామంలోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం 'కాకతీయ రుద్రేశ్వర' (రామప్ప) ఆలయానికి నైరుతి దిశలో ఈ 'గొల్లల గుడి' ఉంటుంది. ఇది తూర్పు ముఖంగా గల మండపం, దాని చుట్టూ మూడు గర్భాలయాలతో కూడిన 'త్రికూటాలయం'గా కనిపిస్తుంది. దీని ప్రహరీ శిల్పాలంకృతమై, పైకప్పు అంచు నిర్మాణం, ద్వారబంధాల వద్ద చెక్కిన హంసల వరుసతో, 'సునిశిత రంధ్రాల వల' పనితనంతో ఈ ఆలయం ఎంతో విశిష్టమైనదిగా అలరారుతోంది. ఈ ప్రధాన గుడికి ముందు వైపున రెండు ప్రత్యేక ఉప ఆలయాలు ఎంతో అందంగా చెక్కిన ద్వారపాలకుల విగ్రహాలతో అలంకృతమై ఉంటాయి. వీటికి ముందు గల అంతరాలయాల అంచులు కూడా చక్కని తెరలతో శోభాయమానంగా కనిపిస్తాయి. ప్రధాన ఆలయ నిర్మాణం ముందు భాగాన మండపం గుండా మధ్యలో గల ప్రధాన మందిరానికి మార్గం ఉంటుంది. దీనికి ఉత్తర, దక్షిణ, పశ్చిమ దిశలలో అంతరాలయాలతో మూడు గర్భాలయాలు కూడా ఉంటాయి. ఆలయ కుడ్యాలపై కనిపించే వివిధ గూళ్లలో విష్ణుమూర్తి, లక్ష్మి, గణేశుడు, మహిషాసురమర్దిని విగ్రహాలు దర్శనమిస్తాయి. జంతువుల ఆకారాలు, పుష్పాలంకరణతో కూడిన ఎత్తయిన వేదికపై ఈ ఆలయం నిర్మితమైంది.



## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి .ఎమ్మెల్యే బాలు నాయక్ సంతాపం

అరుణ ప్రభ, డిండి ,సెప్టెంబర్ 2,దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని దిండి మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు ఎండి మైనుద్దీన్ కుమారుడు బందగి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకొని, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి చేరుకొని బందగి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఎమ్మెల్యే బాలు నాయక్ బందగి మృతి పట్ల దిగ్భ్రాంతిని సంతాపాన్ని వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులను పరామర్శించే కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు . బందగి ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వెంకటయ్య, దేవరకొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మారుపాకుల సురేష్ గౌడ్, చందంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లారెడ్డి, దిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొరికినేని వెంకటేశ్వరరావు, మైనంపల్లి సర్పంచ్ రామ్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొని బందగి మృతికి సంతాపం తెలిపారు.





## కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు సమావేశాలు రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 2: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు న్యూఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలువురు ఉన్నతాధికారులతో బుధవారం సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ (వీశీఎఖూ) కార్యదర్శి కటికితాల శ్రీనివాస్, కేంద్ర రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్ లను తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలు, కేంద్ర--రాష్ట్ర సమన్వయంతో చేపట్టాల్సిన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఆయా సమావేశాల్లో చర్చించారు. కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కటికితాల శ్రీనివాస్తో జరిగిన సమావేశంలో తెలంగాణలో పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణం, పట్టణ మౌలిక వసతులకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. కేంద్ర రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్తో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధి, రహదారి అనుసంధానం, జాతీయ రహదారులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో ముందుకు సాగేందుకు ఈ సమావేశాలు దోహదపడనున్నాయి.

## కెపిహెచ్బిలో గజం భూమి రూ.2.70 లక్షలు

**మరోసారి రికార్డు ధరలకు అమ్ముడుపోయిన హౌసింగ్ బోర్డు భూములు**

**47.14 కోట్ల మేర ఆదాయం.. హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి గౌతం**

హైదరాబాద్, సెప్టెంబరు 2 : కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓపెన్ ప్లాట్లకు మరోసారి భారీ ధర పలికింది. ఎటువంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెంది మంచి డిమాండ్ ఉన్న కెపిహెచ్ బి ప్రాంతంలోని ప్లాట్లు (రాజీవగ్రాశ్రీశీం) బహిరంగం వేలంలో రికార్డు ధరలకు అమ్ముడుపోయాయి. కెపిహెచ్ బి 7 ఫేజ్ లోని 16 ఎంఐజి ప్లాట్లకు బుధవారం నాడు బహిరంగ వేలం నిర్వహించగా, ఒక చదరపు గజం భూమిని 2.70 లక్షలకు (రెండు లక్షల డెబ్బై వేలకు) కొనుగోలు చేశారు. ఈ ప్లాట్ల బహిరంగ వేలం కోసం ఆగస్టు 10 వ తేదీన హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర రూ. 1.60 లక్షలుగా నిర్ధారించగా, చదరపు గజం రూ.2.70 లక్షలకు అమ్ముడు పోయిందని, మరో ప్లాట్ ను చదరపు గజం రూ.2.36 లక్షలకు కొనుగోలు చేశారని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. ఇంకో రెండు ప్లాట్లను 2.06 లక్షలకు వేలం పాటలో కొనుగోలు చేసారని తెలిపారు. పూర్తి పారదర్శకంగా నిర్వహించిన ఈ వేలం పాటలో తమకు నచ్చిన ప్లాట్లను దక్కించుకోడానికి మొత్తం 19 మంది బిడ్డర్లు (కొనుగోలుదారులు) పోటీ పడ్డారు. బుధవారం నాడు బహిరంగ వేలంలో చదరపు గజం సగటు ధర సుమారు రూ.1.79 లక్షలు పలికిందని వివరించారు. ఈ విధంగా నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డ్ కు సుమారు రూ. 47.14 మేర ఆదాయం వచ్చిందని వైస్ ఛైర్మన్ శ్రీ విపి గౌతం వివరించారు.



భార్యను కారుతో ఢీకొట్టి..

## కత్తితో పొడిచి హత్య

**అడ్డువచ్చిన అత్తకు కత్తిపోట్లు.. ఆస్పత్రికి తరలింపు**

**కారుతో పరారైన నిందితుడు సురేష్**

**కుటుంబ కలహాలే హత్యకు కారణమా?**

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 2 (అరుణప్రభ): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను కారుతో ఢీకొట్టి అనంతరం కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం పదిర వడ్డెర కాలనీలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన అత్తపై కూడా కత్తితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ముస్తాబాద్ మండలం చిన్నచీకోడు గ్రామానికి చెందిన పల్లేపు సురేష్ (30), అతని భార్య జ్యోతి (26) మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జ్యోతి రెండు, మూడు రోజుల క్రితం తన పుట్టినిల్లు పదిర గ్రామానికి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. బుధవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో కారులో వచ్చిన సురేష్.. రోడ్డు పక్కన ఉన్న జ్యోతిని కారుతో ఢీకొట్టాడు. కిందపడిపోయిన ఆమెపై కత్తితో పలుమార్లు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన జ్యోతి అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. భార్యపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన సురేష్ అత్త గండికోట ఎల్లవ్వ (60)పై కూడా కత్తితో పొట్ట భాగంలో దాడి చేశాడు. అదే సమయంలో వడ్డెర కాలనీకి చెందిన దేవయ్య సురేష్ను పట్టుకునేందుకు ప్రయత్నించగా, కత్తితో బెదిరించి కారులో అక్కడి నుంచి పరారైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నిందితుడు హత్యకు ఉపయోగించిన కత్తిని ఘటనాస్థలంలోనే వదిలి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డిపేట ఎస్సై రమేష్ గౌడ్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఎల్లవ్వను 108 అంబులెన్స్లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలో లభించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జ్యోతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు సురేష్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. మృతురాలు జ్యోతికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ కలహాలే ఈ దారుణ హత్యకు కారణమా? అన్నకోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సిపిఐ (ఎమ్.ఎల్) రెడ్ స్టార్ కర్ణాటక రాష్ట్రం రాయచూరు 2026 సెప్టెంబరు 16-20 తేదీలలో జరిగే

# 13వ జాతీయ కాంగ్రెస్ ను జయప్రదం చేయండి!

**మన్నవ హరిప్రసాద్ పోలిట్ బ్యూరో సభ్యుడు సిపిఐ (ఎమ్. ఎల్) రెడ్ స్టార్**

భారతదేశాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పరిపాలిస్తున్న కాలంలో 1917 సంవత్సరంలో రష్యాలో లెనిన్ మహాశయుని నాయకత్వాన సోషలిస్టు విప్లవం విజయవంతమైంది. ప్రపంచంలో మొట్టమొదటగా రైతు– కూలీల శ్రామిక రాజ్యం ఏర్పడింది. సర్వసంపదలకు మూలమైన శ్రమజీవుల రాజ్యం ఏర్పడింది. ఆ స్ఫూర్తితో సోవియట్ రష్యా సహాయ, సహకారంతోదేశభక్తులైన ప్రవాస భారతీయులు 1920 అక్టోబర్ 17న తాష్కెంట్లో కామ్రేడ్ షఫీక్ కార్యదర్శిగా భారత కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారు.ఆ స్ఫూర్తితో భారతదేశంలో కలకత్తా, మద్రాసు, బొంబాయి, ఢిల్లీ,లక్నో మొదలగు పారిశ్రామిక పట్టణ ప్రాంతాల్లో నూ, దోపిడీ పీడన ఎక్కడ ఉన్నదో అక్కడ కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీలో అంతర్భాగంగానూ ఉంటూ పని చేసారు.1936 లో ఏర్పడ్డ ఆల్ ఇండియా కిసాన్ సభలోను, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ లోనూ పనిచేయటం ప్రారంభించారు. నాటి కమ్యూనిస్టుల లక్ష్యం ఈ దేశం నుండి బ్రిటిష్ వాడిని వెళ్ళగొట్టడం. బ్రిటిష్ వాడు భారతీయ సంపదను కొల్లగొట్టకుండా చూడటం అనేది ప్రథమ కర్తవ్యం గా ఉన్నది.

సామ్రాజ్యవాదులను ఈ దేశం నుండి తరిమికొట్టడం ద్వారా ఒక మనిషిని మరొక మనిషి దోచుకోవటానికి వీలులేని న్యాయసమతమైన సాంఘిక ఆర్థిక రాజకీయ వ్యవస్థను నిర్మించగలుగుతామని మార్క్సిజం, లెనినిజం ప్రభావానికి లోనైన భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్,చంద్రశేఖర అజాద్, రోషన్ సింగ్, ఖుదీరాం బోస్,బటుకేశ్వర దత్తు, అల్లూరి సీతారామరాజు, బీర్సా ముండా, అష్ఫుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ లాంటి ఎందరో విప్లవ వీరులు క్రాంతి మార్గాన్ని అనుసరించారు. తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా ఎంచి ఉరికంబాలను సైతం లెక్క చేయలేదు. బ్రిటిష్ పోలీసు గుండ్లకు భయపడలేదు. సామ్రాజ్యవాదుల నుండి మాతృదేశ విముక్తే ఏకైక లక్ష్యంగా దేశభక్తులైన కమ్యూనిస్టులు పనిచేశారు. 1925 వ సంవత్సరం కాన్పూర్ లో దేశంలో పని చేస్తున్న కమ్యూనిస్టులు అందరూ ఒకచోటకు చేరి మొట్టమొదట జాతీయ మహాసభ జరుపుకున్నారు. ఎస్వీ ఘాటే ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

1947 ఆగస్టు 15న ఈ దేశం నుండి బ్రిటిష్ వాడు వెళ్లిపోయాడు. డాక్టర్

బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పడింది. భారత రాజ్యాంగాన్ని రాసే బాధ్యతలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు అప్పగిస్తూ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్గా నియమించారు. డా.బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పూర్తి చేసి 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగ పరిషత్ కు అప్పగించారు. ఆ రాజ్యాంగం1950 జనవరి 26వ తేదీ నుండి అమలులోకి వచ్చినది.

తెల్ల దొరల పాలన పోయి నల్లధొరల పాలనలో సామాన్యుడి సమస్యలు పరిష్కారం కాలేదు. గ్రామీణ ప్రాంత రైతాంగం అనేక పోరాటాలు చేశారు. మన రాష్ట్రంలో తెలంగాణ సాయుధ పోరాటం, శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం, నక్సల్బరి గిరిజన రైతాంగ పోరాటం, ఇంద్రవెల్లి గిరిజన రైతాంగ పోరాటం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటం, బీర్భూమ్ పోరాటం, కేరళలో వైనాడు గిరిజన రైతాంగ పోరాటం, దేశంలో రైతాంగం పోరాడని ప్రాంతం అంటూ లేదు.భూ సంస్కరణ చట్టాలు బుట్ట దాఖలు చేశారు, గిరిజన రక్షణ చట్టాలు అమలుకు నోచుకోలేదు.

భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన మరుసటి దినమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్ ) అంబేద్కర్ చే రాయబడ్డ, భారత రాజ్యాంగ పరిషత్ చే ఆమోదించబడ్డ భారత రాజ్యాంగాన్ని తిరస్కరిస్తున్నట్లు, భారత రాజ్యాంగం అంటే "మనుస్మృతి" ఉండాలని, జాతీయ పతాకంగా మూడు రంగుల జెండాను కూడా తిరస్కరిస్తున్నామని కాషాయ జెండా జాతీయ జెండాగా ఉండాలన్నారు.ఆర్ఎస్ఎస్ నాయకులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు, వారి పత్రిక ఆర్గనైజర్ లో రాశారు. అటల్ బిహారీ వాజ్పేయి ప్రధానమంత్రి అయ్యేంతవరకు వారు మూడు రంగుల జెండాను ఎగురవేయలేదు. హిందూ మహాసభ నాయకుడు వినాయక దామోదర సర్కార్ బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు అనేక లొంగుబాటు ఉత్తరాలు రాశారు. జాతీయోద్యమంలో ఎటువంటి పాత్రలేని ఆర్ఎస్ఎస్ హిందూ– ముస్లిం సామరస్యాన్ని కోరుకున్నందుకు జాతిపిత మహాత్మా గాంధీని హిందూ మహాసభ కార్యకర్త నాథూరామ్ గాడ్సే కాల్చి చంపారు. ఈనాడు నిస్సిగ్గుగా ఆర్ఎస్ఎస్ భాజపా నాయకులువారిని గొప్ప దేశభక్తులు గా వర్ణిస్తున్నారు.

నరేంద్ర మోడీ రెండవసారి అధికారంలోకొచ్చిన తరువాత కాశ్మీర్ కు స్వయం ప్రతిపత్తిని ఇచ్చే రాజ్యాంగం లోని 370, 35ఏ ఆర్టికల్స్ను రద్దు చేశారు. ఎన్ పి ఆర్, ఎన్ ఆర్ సి, సి ఏ లాంటి చట్టాలను,మూడు వ్యవసాయ నల్ల చట్టాలను, 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చారు. ఒకే దేశం– ఒకే పన్ను పేరుతో రాష్ట్రాల పన్ను అధికారాన్ని నియంత్రించి, జీఎస్టీ (వస్తువుల –సేవల చట్టాన్ని )చట్టాన్ని తీసుకొచ్చారు." సర్ " చట్టాన్ని తీసుకొచ్చి ఎన్నికల వ్యవస్థను అపహాస్యం చేశారు. ఇస్లాం ఫోబియాను రెచ్చగొట్టారు. తమకు వ్యతిరేకమైనటువంటి రాజకీయ సంస్థలను సిబిఐ,ఈడి, ఇన్కమ్ టాక్స్, తదితర రాజ్యాంగ సంస్థలను ఉపయోగించి వారిని లో బరుచుకుంటున్నారు . చివరకు న్యాయ వ్యవస్థను కూడా కాషాయీకరణ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. భారత రాజ్యాంగ ప్రవేశికలో చెప్పినటువంటి సార్వభౌమ,స్వతంత్ర,లౌకిక, సోషలిస్టు, ప్రజాస్వామిక, విధానాలకు తిలోదకాలు యిస్తున్నారు. కాషాయ కార్పొరేట్ మతోన్మాదాన్ని పురికొల్పి నయా ఫాసిజానికి తెరలేపారు. మోడీ ప్రభుత్వం అంబానీ, ఆదానీ లాంటి ఆశ్రిత పెట్టుబడుదారులకు అనుకూలంగా పరిపాలన చేస్తున్నది . మన రాష్ట్రానికి సంబంధించి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుని సాధించినటువంటి లక్షల కోట్ల రూపాయల జాతి సంపదను ప్రైవేటు కంపెనీలకు ధారాధత్వం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకున్నది. విమాన సర్వీసులను టాటా కు అప్పగించారు. విమాన ఆశ్రయాలను ఆదానికి అప్పగించారు. ఓడరేవులను, జాతీయ రహదారులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను అన్నిటినీ అంబానీ, ఆదానీలకు అప్పగించారు.

భారతదేశ ప్రభుత్వ విదేశీ విధానం అమెరికా సామ్రాజ్యవాదుల అదుపు ఆజ్ఞలోనూ ఐఎంఎఫ్,ప్రపంచ బ్యాంకుఆదేశాలతోనూ పనిచేస్తూ ఉన్నది. అమెరికా సామ్రాజ్యవాదులకు జూనియర్ భాగస్వాములుగా భారత పాలకవర్గాలు కార్పొరేట్లు వ్యవహరిస్తున్నాయి. పాలస్తీనా–ఇజ్రాయెల్ సమస్యపై కానీ, ఇరాన్–అమెరికా సమస్యపై కానీ, రష్యా ఉక్రెయిన్ యుద్ధ సమస్య విషయంలో కానీ భారత పాలకవర్గాలు అమెరికా అనుకూల విధానాలను అవలంబిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలు పటిష్టమైన రాష్ట్ర కమిటీల నిర్మాణం కలిగి ఉండి కార్మిక రైతుల విద్యార్థి యువజన మహిళా సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న ప్రజా సంఘాలను కలిగి ఉన్న సిపిఐ (ఎమ్. ఎల్) రెడ్ స్టార్ పార్టీ తన 13వ జాతీయ సభలను జరుపుకోనున్నది. ఈ మహాసభలను దేశం మొత్తం నుండి,విదేశాల నుండి ప్రతినిధులు సౌహార్ద ప్రతినిధులు హాజరై సెప్టెంబరు 16వ తేదీ నుండి 20వ తేదీ వరకు జాతీయ అంతర్జాతీయ విషయాలను చర్చించి భారత ప్రజల భవిష్యత్తుకు నూతన మార్గాన్ని అందించటంకొరకు తన కార్యక్రమాలను సమీక్షించుకొని ముందుకు పోవడం కోసం 13వ జాతీయ కాంగ్రెస్ ను రాయచూర్ లో జరుపుకుంటున్నది.



కావున యావత్ ప్రజలు,శ్రామిక వర్గం, విద్యార్థి, మేధావులు ఈజాతీయ మహాసభ జయప్రదం చేయటానికి ఆర్థికంగా, హార్దికంగా సహాయపడగలరని విజ్ఞప్తి చేస్తున్నాము.

**ఇట్లు,**

**విప్లవాభినందనలతో**

**సిపిఐ (ఎంఎల్ రెడ్ స్టార్,పొలిట్ బ్యూరో సభ్యుడు.**

# సర్ మెగా హియరింగ్‌కు నోటీసులు అందుకున్న వారు తప్పనిసరిగా హాజరు కావాలి

### సెప్టెంబర్ 5, 6 తేదీలలో ప్రత్యేక మెగా హియరింగ్

### అవసరమైన ఆధార పత్రాలతో హాజరు కావాలి

రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 2: రంగారెడ్డి జిల్లాలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన కేసులకు సంబంధించి సెప్టెంబర్ 5, 6 తేదీలలో సర్ మెగా హియరింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. సర్ ప్రక్రియలో భాగంగా సంబంధిత ఓటర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, నోటీసులు అందుకున్న ప్రతి వ్యక్తి తమ నోటీసులో పేర్కొన్న తేదీ, సమయం, హియరింగ్ కేంద్రానికి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. హియరింగ్‌కు హాజరై తమకు సంబంధించిన అభ్యంతరాలు, వివరణలు, వాదనలు, అవసరమైన వివరాలను సంబంధిత అధికారుల ముందు సమర్పించుకోవాలని తెలిపారు.



**తప్పనిసరిగా తీసుకురావాల్సిన పత్రాలు**

హియరింగ్‌కు హాజరయ్యే వారు క్రింది పత్రాలను తమ వెంట తీసుకురావాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు.

**పరిశీలనకు వర్తించే పత్రాలు:**

ప్రభుత్వ, పీఎస్‌యూ ఉద్యోగి ఐడీ లేదా పెన్షన్ ఆర్డర్ – ఉద్యోగి లేదా పెన్షనర్‌కు సంబంధించిన గుర్తింపు పత్రం. ప్రభుత్వం, బ్యాంకు, స్థానిక సంస్థలు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు లేదా ఇతర సంబంధిత పత్రాలు. పూర్తి తేదీ ధ్రువీకరణ పత్రం – సంబంధిత అధికార పరిధిలో జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం. పాస్‌పోర్ట్ – భారత ప్రభుత్వం జారీ చేసిన చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్. విద్యా అర్హత ధ్రువీకరణ పత్రాలు – గుర్తింపు పొందిన బోర్డు, విశ్వవిద్యాలయం లేదా విద్యాసంస్థల నుంచి పొందిన ధ్రువపత్రాలు. శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం – రాష్ట్ర అధికారులు జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రం. అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం – అధికారికంగా జారీ చేసిన అటవీ హక్కుల పత్రం. కుల ధ్రువీకరణ పత్రం -- సమర్థ అధికారి జారీ చేసిన ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ లేదా ఇతర కుల ధ్రువీకరణ పత్రం.

**ఎన్ఆర్ఐల కోసం ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డు.**

కుటుంబ రిజిస్టర్ – రాష్ట్ర లేదా స్థానిక అధికారులు జారీ చేసిన కుటుంబ రిజిస్టర్. భూమి లేదా ఇంటి కేటాయింపు పత్రం -- ప్రభుత్వం జారీ చేసిన భూమి లేదా ఇంటి కేటాయింపు ధ్రువీకరణ పత్రం.

ఆధార్ కార్డు – నిర్దిష్ట ఈసీఐ మార్గదర్శకాలు, ఆదేశాల మేరకు మాత్రమే పరిశీలనకు తీసుకోవచ్చు.

నోటీసులో పేర్కొన్న వివరాలకు అనుగుణంగా అవసరమైన ఆధారాలను సమర్పించడం ద్వారా తమ వాదనను స్పష్టంగా తెలియజేసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తమకు కేటాయించిన హియరింగ్ తేదీ, సమయం, కేంద్రాన్ని ముందుగానే పరిశీలించుకుని, ఎటువంటి ఆలస్యం లేకుండా నిర్ణీత సమయానికి హాజరు కావాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు.

సర్ ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరుకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించి, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

కావున సర్ హియరింగ్‌కు నోటీసులు అందుకున్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ గైర్హాజరు కాకుండా, నోటీసులో పేర్కొన్న తేదీ, సమయం, హియరింగ్ కేంద్రానికి తప్పనిసరిగా హాజరై, తమ వద్ద ఉన్న సంబంధిత ఆధార పత్రాలతో తమ వివరణ లేదా వాదనను సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నోటీసు అందుకున్న ప్రతి వ్యక్తి సెప్టెంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించే మెగా హియరింగ్‌ను సద్వినియోగం చేసుకుని, సర్ ప్రక్రియకు అవసరమైన సహకారం అందించాలని ఆయన కోరారు.

# విద్యార్థుల సంప్రదాయ వస్తువుల తొలగింపుపై యువమోర్చా ఆగ్రహం





ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 2 (అరుణప్రభ): మాస్టర్ మైండ్ పాఠశాల యాజమాన్యం తీరును నిరసిస్తూ యువమోర్చా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు హిందూ సంప్రదాయబద్ధంగా చేతికి, మెడలో ధరించే వస్తువులను పలు మార్లు తొలగిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై గతంలోనే హిందూ సంఘాలు, బీజేవైఎం నాయకులు పాఠశాల యాజమాన్యాన్ని హెచ్చరించినప్పటికీ సరైన స్పందన లేకపోవడంతో యువమోర్చా నాయకులు యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. విద్యార్థుల సంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని వారు పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థులను మతాల ఆధారంగా వేరు చేసే విధంగా వ్యవహరించడం సరికాదని, ఇలాంటి చర్యలు విద్యార్థుల మనోభావాలను దెబ్బతీస్తాయని నాయకులు అన్నారు. పలు మార్లు హెచ్చరించినప్పటికీ యాజమాన్యం తన వైఖరిని మార్చుకోలేదని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై స్థానిక మండల విద్యాశాఖ అధికారి వెంటనే స్పందించి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని యువమోర్చా, హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల మత, సంప్రదాయ స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



### రైతు భీమా పథకం కొనసాగించాలి

### రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

### సంది తిరుపతి రెడ్డి రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పెద్దపల్లి, సెప్టెంబర్ 2(అరుణ ప్రభ ప్రతినిధి) : రైతు కుటుంబాలను పెద్ద దిక్కును కోల్పోతే ఆ ఇంటి కి ఆర్థిక బరోసా ఇచ్చే రైతు భీమా పథకం కొనసాగించాలి, పేద రెడ్లకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏర్పాటు చేస్తామన్న రెడ్డి కార్పొరేషన్ కు నిధులు విడుదల చేయాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ లో ' రెడ్ల నిరసన దీక్ష ' గోడ పత్రికను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బండ గోపాల్ రెడ్డి తో కలిసి ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా సంధి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఈనెల 08–2026 నాడు రెడ్డి కార్పొరేషన్ కు వెయ్యి కోట్ల నిధి తో పాటు వెంటనే పాలకవర్గం ఏర్పాటు చేయాలని వేలాదిమందితో...ఇందిరాపార్క్ హైదరాబాద్ లో జరుగబోయే " రెడ్ల నిరసన దీక్ష " కు తెలంగాణ జిల్లాల నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని ప్రతి రెడ్డి కుటుంబాన్ని శిరస్సు వంచి నమస్కరిస్తూ కోరుతున్నాను.మాటిచ్చి మరచిపోయిన రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేయడానికే దీక్ష. రెడ్డి కార్పొరేషన్ తో పాటు రైతు భీమా పథకం కొనసాగించాలి. జుబొ పదిశాతం రిజర్వేషన్ ను అన్ని ప్రభుత్వ విభాగాల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలని, మన... మన పిల్లల భవిష్యత్ కోసమే చేస్తున్న దీక్ష కు తెలంగాణ జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉన్న ప్రతి రెడ్డి కుటుంబం నుండి ఒకరు రావాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు నరహరి లక్ష్మా రెడ్డి, సుల్తానాబాద్ రెడ్డి సంఘం అధ్యక్షుడు కోట రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పెంద్యాల సమ్మి రెడ్డి, గౌరవ అధ్యక్షుడు మ్యకల తిరుపతి రెడ్డి, పల్లె శ్రీనివాస్ రెడ్డి,ఉపాధ్యక్షుడు పలుగు సమ్మి రెడ్డి, కోశాధికారి కాశం రాజి రెడ్డి, సంయుక్త కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కొత్తిరెడ్డి మహేందర్ రెడ్డి, పబ్బతి మల్ల రెడ్డి, హనుమంత రెడ్డి తదితరులు ఉన్నారు.

### భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

### ఎల్లారెడ్డిపేట మండలం సర్వాయిపల్లిలో భూముల రీ సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్. : భూముల రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టి, వివరాల నమోదులో తప్పులు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. భూ భారతి కింద ఎల్లారెడ్డిపేట మండలం సర్వాయిపల్లి గ్రామంలో రోవర్ యంత్రాలతో చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులు, సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ఉన్న రెవెన్యూ, అటవీ భూముల రీ సర్వే కు సంబంధించిన వివరాలను అదనపు కలెక్టర్ ఆరా తీశారు. రీ సర్వే కు సంబంధించి గ్రామంలోని రైతులకు సమాచారం ఇచ్చారా లేదా అనే వివరాలను తెలుసుకున్నారు. నిబంధనల మేరకు సర్వే చేపట్టాలని అధికారులు, సర్వేయర్లను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ వేణు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.



### కుట్టు మిషన్ల పథకం

### ప్రొక్యూర్‌మెంట్ సెప్టెంబర్ 7లోపు పూర్తి చేయాలి

### బీసీ సంక్షేమ శాఖ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 2: మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న కుట్టు మిషన్ల పథకం దరఖాస్తులు, ప్రొక్యూర్‌మెంట్, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మినిస్టర్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. కుట్టు మిషన్ల కోసం ఇప్పటివరకు వివిధ జిల్లాల నుంచి 1,80,170 దరఖాస్తులు అందినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కుట్టు మిషన్ల ప్రొక్యూర్‌మెంట్‌కు సంబంధించిన షెడ్యూల్, టెండర్ల తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. సెప్టెంబర్ 7వ తేదీలోపు ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 15 తర్వాత ప్రీ–బిడ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెయ్యి కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన నియోజకవర్గాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, మహిళా సంఘాలు, గ్రామపంచాయతీల సహకారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యేలోపు అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కుట్టు మిషన్ల పథకం అమలుపై సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల వివిధ బీసీ కుల సంఘాల కార్పొరేషన్లకు ఎన్నికైన చైర్మన్లకు కార్యాలయాలు, మౌలిక సదుపాయాలు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని మంత్రి ఆదేశించారు. బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణం, వాటి పురోగతి తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని 327 మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల పనితీరు, మౌలిక సదుపాయాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలు, విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలపై మంత్రి సమీక్షించారు. 327 గురుకుల పాఠశాలల్లో ప్రస్తుతం 22 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్న నేపథ్యంలో మిగిలిన పాఠశాలలకు అవసరమైన భవనాలు, స్థలాలపై సమగ్ర నివేదికను ఈ నెల 15వ తేదీలోపు అందించాలని ఆర్‌సీవోలను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో బీసీ గురుకులాలకు స్థలాలు అందుబాటులో ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో స్థలాలు లేని పరిస్థితిపై నియోజకవర్గాల వారీగా నివేదిక రూపొందించాలని సూచించారు. అవసరమైన చోట్ల జిల్లా కలెక్టర్ ద్వారా స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందుకోసం బీసీ సంక్షేమ శాఖకు చెందిన నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

